VISALAANDHRA VIJAYAWADA PHONE No. 376

4 పేజీలు 6 నయాపైసలు రిజిష్టరు నెం. 193

విశాలాంధ్ర

706167

సంపుటి 8] విజయవాడ * 7 ఆగస్టు 1959 * శుక్రవారం [సంచిక 119

పాకిస్తాన్ సైనికుల కాల్పులు పూర్తిగా అక్రమం

—లోక్‌సభలో ప్రధాని నెహ్రూ

న్యూఢిల్లీ, ఆగస్టు 6

ఇటీవల దవాకీ, తదితర ప్రాంతాల్లో పాకిస్తాన్ సైనికులు జరిపిన కాల్పులు పూర్తిగా అక్రమమనీ, వారి కాల్పులకు ఎలాంటి కారణం కనబడదని నేడు లోక్ సభలో ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ కొన్ని ప్రశ్నలకు సమాధానంగా తెలియజేశారు.

'కడెం మట్టిఆనకట్ట తెగినమాటనిజమే'

నీటిపారుదల మంత్రి శ్రీ నరసింగరావు ఒప్పుకోలు

హైద్రాబాద్, ఆగస్టు 6

కడెం వద్ద ఇటీవల నిర్మించిన మట్టి ఆనకట్టకు గండిపడినమాట నిజమేనని నీటిపారుదల మంత్రి శ్రీ జె. వి. నరసింగరావు నేడు శాసన పరిషత్తులో మాట్లాడుతూ అన్నారు. ఈకట్ట తెగినవిషయం కమ్యూనిస్టు శాసనసభ్యుడు శ్రీ గంగారాం బయటపెట్టినమాట పాఠకులకు విదితమే. అయితే ఈకట్ట మరమ్మత్తుకు 4 వేలకుమించి ఖర్చు కాదని మంత్రిగారు సమస్యను దాటవేయడానికి ప్రయత్నించారు.

ప్రజాప్రభుత్వాన్ని కూలద్రోయాలన్న కుట్రే కేంద్రంచర్యకు కారణం

ఈ కుట్రలో కాంగ్రెసు అగ్రనాయకుల పాత్రకలదని కేరళ కమ్యూనిస్టు కమిటీ తీర్మానం

అమెరికా - రష్యాల మధ్య స్నేహ సంబంధాలు

అవసరమని కృశ్చేవ్ : శాంతి స్థాపనకు సోవియట్‌తో సహకరించమని విజ్ఞప్తి

మాస్కో, ఆగస్టు 5

"సోవియట్‌యూనియన్‌తో అమెరికా స్నేహ సంబంధాలను నెలకొల్పుకుని, తద్వారా ప్రపంచంలో శాంతిస్థాపనకై సోవియట్‌తో సహకరించాలి... ద్వితీయ ప్రపంచ యుద్ధావశేషాలను తుడముట్టించాల్సిన సమయం నేడు ఆసన్నమైనదని మేముభావిస్తున్నాం. ఇందుకు ప్రథమచర్యగా జర్మనీతో శాంతి ఒడంబడికను కుదుర్చుకోవడం భావ్యంగా వుంటుంది" అని సోవియట్ ప్రధాని నికిటా కృశ్చేవ్ నేడు క్రెమ్లిన్‌లో జరిగిన ఒక పత్రికా గోష్ఠిలో చెప్పారు.

వచ్చే సెప్టెంబరు మాసంలో తన అమెరికా యాత్రను గూర్చి వ్యాఖ్యానిస్తూ కృశ్చేవ్ ఈ విషయాల్ని చెప్పారు.

"సోవియట్ - అమెరికా సంబంధాలలో అభివృద్ధి ఆసేదివుంటే, ఇతర దేశాలతో కూడా సంబంధాలు అభివృద్ధి చెందడానికి అవకాశంవుంటుంది. దీని ద్వారా ప్రపంచంలోని యితర ప్రాంతాలలో అలుముకొనివున్న కారు మేఘాలను తొలగించవచ్చు"నని ఆయన తెలియజేశారు.

క్రెమ్లిన్ పత్రికాగోష్ఠికి 300 మంది విలేఖరులు హాజరైనారు.

తన అమెరికాయాత్ర వచ్చేనెల మధ్యలో ప్రారంభమవుతుందని, అలాగే అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ వచ్చే ఆకురాలుకాలంలో సోవియటును సందర్శించనున్నారని కృశ్చేవ్ చెప్పారు.

వాషింగ్టన్‌లో తన సంభాషణలు ప్రయోజనకరంగా ఉండగలవని కృశ్చేవ్ ఆశిస్తున్నట్లు మాస్కో రేడియో ప్రకటించింది. తన సంభాషణలు అనధికార సంభాషణలే గాని, సంప్రదింపులు మాత్రం కావని ఆయన తెలియజేశారు.

"పరిష్కారం కావాల్సిన సమస్యలపై అంగీకారయోగ్యమైన అవగాహనకు రావడమనేదే అసలు ప్రధాన సమస్య" అని కూడా కృశ్చేవ్ అన్నారు.

ఈ సంవత్సరం మొదట్లో బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ సోవియట్ సందర్శించినప్పుడు ఆయనతో జరిపిన సంభాషణలను గూర్చికూడా కృశ్చేవ్ ఈ పత్రికా గోష్ఠిలో ప్రస్తావించారు.

"ఇటీవల ప్రధాని మాక్మిలన్‌తో మేము జరిపిన సంభాషణలు ఉపయోగకరమైనవీ, ఫలప్రదమైనవీ అని మా అభిప్రాయం" అని కృశ్చేవ్ తెలిపారు.

"మీ అమెరికా పర్యటన సందర్భంలో టెలివిజన్‌లో ప్రసంగించ [illegible] లన్న కూడదనే మీరు అంగీకరిస్తారా?" అని విలేఖరులు ప్రశ్నించగా "ఔను, అటువంటి ఆహ్వానాన్ని సద్వినియోగం చేసుకోగలనే నా భావన" అని కృశ్చేవ్ సమాధాన మిచ్చారు.

అధ్యక్షుడు ఐసెన్ హోవర్‌తో జరిపే సంభాషణల్లో ఏ విషయాల్ని మీరు ప్రస్తావించదలచారు? అని ప్రశ్నించగా, ద్వితీయ ప్రపంచ యుద్ధావశేషాలైన జర్మనీ, బెర్లిన్ సమస్యలే నేటికీ అపరిష్కృతంగా వున్న సమస్యలు అని కృశ్చేవ్ చెప్పారు.

ఆయన యింకా ఇలా అన్నారు: "మా ఉద్దేశంలో ఈ యుద్ధావశేషాలు నేడు ప్రమాద భరితంగా వున్నాయి. ఇవి ఎప్పుడైనా తిరిగి రగుల్కొనే ప్రమాదంవుంది

"అందు చేత మొట్టమొదటగా చేయదలచినపని—జర్మనీతో శాంతి సంధి కుదుర్చుకోవడం. ఫలితంగా నిరాయుధీకరణ, విదేశీసేనల ఉపసంహరణలాంటి యితర సమస్యలు పరిష్కారం కావడానికి మార్గం సుగమమవుతుంది."

"ఐసెన్‌హోవర్‌తో మీ సమావేశం శిఖరాగ్ర సమావేశానికి నాంది కాగలదా లేక దానికిబదులుగా జరిగే సమావేశమేనా యిది అని విలేఖరులు ప్రశ్నించగా" ఐసెన్‌హోవర్‌తో నా సమావేశం రెండు దేశాల ప్రతినిధులమధ్య సమావేశమే కాగలదని నా అభిప్రాయం. ఈ సమావేశం యిరుదేశాలకు సంబంధించిన విషయాల్ని చర్చించడానికి ఉద్దేశింపబడ్డది కాదుగదా. అందుచేత మా ఉభయుల మధ్య జరిగే సమావేశం శిఖరాగ్ర సమావేశానికి ఎంతమాత్రమూ సరిపోదు. శిఖరాగ్ర సమావేశము నేటికి చాల ఉపయోగకరమైనదనే యిప్పటికీ మా అభిప్రాయం" అని కృశ్చేవ్ సమాధాన మిచ్చారు.

తనకూ, ఐసెన్‌హోవర్‌కూ మధ్య జరిగే సమావేశమూ, శిఖరాగ్ర సమావేశమూ పరస్పర విరుద్ధమైనవి కావు గాని, ఈ రెండింటికీ అవినాభావ సంబంధం వుందని ఈ రెండురకాల సమావేశాలు ఒకదానికొకటి తోడ్పడాలని కృశ్చేవ్ అన్నారు.

"అమెరికా యాత్రకు ముందు, మీరు సోషలిస్టు దేశాలతో ఒక సమావేశాన్ని జరపదలచారా?" అని ఒక విలేఖరి ప్రశ్నించగా, "అటువంటి సమావేశాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరం లేదనుకుంటాను. శాంతి స్థాపనకై జరిగే కృషిని శాంతికాముక దేశాలన్నీ ఎలాగూ బలపరుస్తాయి కదా" అని ఆయన చెప్పారు.

ప్రశ్న : అమెరికా సందర్శనానంతరం మీరు కెనడా సందర్శించనున్నారా?

కృశ్చేవ్ : అదెలా సాధ్యమవుతుంది? ఒక దేశాన్ని సందర్శించాలీ అంటే, అందుకు ఆహ్వానం అవసరం కదా. అసలటువంటి సమస్యే లేనప్పుడు కెనడా సందర్శనను గూర్చి ఆలోచించాల్సిన పనేమిటి?

ప్రశ్న : స్కాండినేవియా దేశాలలో వచ్చిన విమర్శ, పత్రికల విమర్శ కల్లనే మీరు ఆదేశాల పర్యటనను విరమించుకొన్నారుగదా. అటువంటి స్వభావం ఇతరమైన వ్యాఖ్యలు, విమర్శలు అమెరికాలో కూడావస్తే మీరేమి చేయనున్నారు?

కృశ్చేవ్ : అమెరికా పంపినఆహ్వానం యిందుకు పూర్తిగా భిన్నమైనట్టిది. ఈ ఆహ్వానం అమెరికన్ అధ్యక్షుని వద్దనుండీ, డెమొక్రటిక్, రిపబ్లిక్ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులనుండీ వచ్చింది.

ఏమైనప్పటికీ, భిన్నాభిప్రాయాలు లేని కుటుంబం అంటూ వుండదుగదా. అందుచేత ఉభయత్రా జరిగే ఇటువంటి సందర్శనలను గూర్చి అందరి మధ్యా పూర్తి ఏకాభిప్రాయం వుంటుందనుకోవడం పొరపాటని భావిస్తున్నాను."

బడుగుదేశాలకు సహాయంచేసే విషయమై కూడా ఐసెన్‌హోవర్‌తో తాను చర్చించదలచానని కృశ్చేవ్ ఒక భారతీయ విలేఖరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎజెండా అనేది యింతవరకూ ఏమీ లేదు గాబట్టి, చర్చించదగ్గ సమస్యలేవో యిప్పుడు చెప్పడం కష్టమని అన్నారు.

అయితే బడుగు దేశాల అభివృద్ధి అనేది చాల ప్రధానసమస్య అని, ఈ విషయమై తనకు చర్చించాలని వుందని కృశ్చేవ్ తెలియజేశారు.

తమరాష్ట్రాన్ని ఎవరు పరిపాలించాలో కేరళ ప్రజలే నిర్ణయిస్తారని ఉద్ఘాటన

నంబూద్రిపాద్ ప్రభుత్వంచేసిన అభ్యుదయ చట్టాలను తిరగదోడవద్దని హెచ్చరిక

తిరువనంతపురం, ఆగస్టు 5

కేరళను ఎవరు పాలించాలి అన్న సమస్యను నిర్ణయించేది కేంద్ర ప్రభుత్వంగాని, కాంగ్రెసు అధిష్టానవర్గంగాని కాదనీ, కేరళప్రజలేననీ, తిరువనంతపురంలో రెండురోజులుగా జరుగుతున్న కేరళరాష్ట్ర కమ్యూనిస్టుకమిటీ సమావేశమై తీర్మానించారు. కేరళలో కేంద్రం జోక్యం చేసుకున్న చర్య రాజ్యాంగ విరుద్ధమనీ, ప్రజాస్వామ్య విరుద్ధమనీ, వివక్షతో కూడిందనీ కేంద్రం చర్యకు తన తీవ్ర నిరసనను తెలియజేశారు.

కేరళలో ప్రతిపక్షాల ఉద్యమమూ, కేంద్రం జోక్యమూ, ప్రమాదకరమైన అత్యంత పరిణామాలను తెచ్చిపెడుతాయి. ప్రజాస్వామ్యంలోనూ, శాంతియుతంగా సాంఘికార్థికాభివృద్ధి సాధ్యమన్న విషయంలోనూ ప్రజలకుగల విశ్వాసానికి, కేంద్రం జోక్యం చాల తీవ్రమైన ఆఘాతమని ఆ తీర్మానము పేర్కొన్నది.

ఈ సమావేశానికి భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ అజయఘోష్ హాజరయ్యారు. సమావేశానంతరం శ్రీ అజయఘోష్ తిరిగి ఢిల్లీకి వెళ్ళారు. ఢిల్లీలో రేపు సమావేశం కాబోతున్న కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు శ్రీ నంబూద్రిపాద్, శ్రీ అచ్యుతమీనన్, శ్రీ గోవిందన్ నాయర్లు కూడా ఢిల్లీ బయల్దేరారు.

ఆ తీర్మానంలో ఇంకా ఈ విధంగా ఉంది.

ఎన్నిక కాబడి శాసనసభా విశ్వాసాన్ని ఇంకా పొందుతున్న మంత్రివర్గాన్ని కూలద్రోయడానికి ఒక పెద్ద కుట్ర జరిపిన పర్యవసానమే కేంద్రం జోక్యమనేది స్పష్టం. కేంద్ర ప్రభుత్వం కేవలం కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం క్రింద ఏర్పడ్డ కాంగ్రెసేతర ప్రభుత్వం కావడంవల్లనూ, సామాన్య ప్రజానీకంయొక్క ప్రయోజనాల కొరకు మంత్రివర్గం నిజమైన, దృఢతరమైన చర్యలు తీసుకోవడంవల్లనూ, కేంద్రం జోక్యం కల్పించుకొన్నది.

ఈ కుట్రలో కాంగ్రెసు అగ్రనాయకత్వానికీ, కేంద్ర మంత్రులకూ మొదటినుండీ ముఖ్యమైనపాత్ర ఉన్నదని రాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ బాధ్యతతో నొక్కి చెబుతూంది.

ఈ కుట్రలో ఇమిడి ఉన్న ప్రమాదాలు తనకు పూర్తిగా తెలిసి ఉండీ, దాన్ని నివారించ గల్గి ఉండీకూడా, శ్రీ నెహ్రూ తన ధర్మాన్ని నిర్వర్తించలేదు సరికదా, ఈ కుట్రను రూపొందించిన కాంగ్రెసునాయకుల ఒత్తిడికి ఆయన లొంగిపోయారు. శ్రీ నెహ్రూ ఆ విధంగా లొంగిపోయి, రాజ్యాంగాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ నలిమివేయడంలో తనకూడా భాగస్వామి అయ్యారు.

కమ్యూనిస్టు మంత్రివర్గం పరిపాలన చేసిన కాలంలో సామాన్య ప్రజలకు లభించిన హక్కులనూ,

(మిగతా 4 వ పేజీలో)

లావోస్‌లో తీవ్ర పరిణామాలు

ఉత్తర వియత్నాం ప్రభుత్వ హెచ్చరిక

హాంకాంగ్, ఆగస్టు 5

లావోస్‌లోని ప్రస్తుత ప్రమాదకర పరిస్థితికి అమెరికన్ సామ్రాజ్యవాదులే ప్రధాన కారణమని లావోస్ సమస్యను లావోస్ రాచరిక ప్రభుత్వం ఐ రా స ముందుంచడానికి యత్నించడం కవ్వింపుచర్య కాగలదని ఉత్తర వియత్నాం ప్రజా రిపబ్లిక్ ప్రభుత్వం నేడు హెచ్చరించింది.

లావోస్ రాచరిక ప్రభుత్వం లావోస్ పరిస్థితిపై ఐరాసకొక లేఖ పంపింది. దానివల్ల దేశంలోని పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదమున్నదని కూడా ఉత్తర వియత్నాం ప్రభుత్వం హెచ్చరించింది.

వియత్నాం ప్రభుత్వంచేసిన ప్రకటన డాక్యుమెంటు రూపంలోవుంది. దీనిని వియత్నాం విదేశాంగ శాఖ విడుదల చేసిందని నవచైనా వార్తా సంస్థ ప్రకటించింది.

లావోస్‌లోని రాచరిక ప్రభుత్వ సేనలకు, పాథట్‌లావో ప్రజాతంత్ర దళాలకుమధ్య పోరాటం యింకా కొనసాగుతూనే వుందని లండన్ వార్తలు.

రాచరిక ప్రభుత్వ అబద్ధ ప్రచారం

హాంకాంగ్, ఆగస్టు 6

లావోస్‌లో ఉత్తర వియత్నాం జోక్యం కల్పించుకున్నదని లావోస్ రాచరిక ప్రభుత్వం చేసిన ఆరోపణ నిరాధారమైనదనీ, పూర్తి అబద్ధమని హానాయ్‌నుండి నవచైనా వార్తాసంస్థ ఒక ప్రకటనలో తెలియజేసింది.

ప్రధాని నెహ్రూకు ఉత్తర వియత్నాం ప్రధాని లేఖ

లావోస్ పరిస్థితినిగూర్చి ఉత్తర వియత్నాం రిపబ్లిక్ ప్రధాని ఫామ్ వాన్ డాంగ్ నేడు భారతప్రధాన మంత్రి శ్రీ నెహ్రూకు ఒక లేఖ పంపారని నవచైనా వార్తాసంస్థ తెలియజేసింది. ఆ లేఖలో ఆయన లావోస్‌లో అమెరికన్ సామ్రాజ్యవాదులు, రాచరిక ప్రభుత్వం సరికొత్త యుద్ధానికి ఎలా సన్నాహాలు చేస్తున్నారో వివరించారు. ఈ ఘటనలపట్ల లావోస్ అంతర్జాతీయ సంఘం అధ్యక్షులుగా భారత దేశం సరైన దృక్పథాన్ని అనుసరిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

కేరళలో కాంగ్రెస్, పి.యస్.పి., కాథలిక్ చర్చీల ఉన్మత్త చర్యలు

అనేకచోట్ల విచ్చలవిడిగా దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నట్లు వార్తలు

[విశాలాంధ్ర విలేఖరి]

తిరువనంతపురం, ఆగస్టు 8

కేరళలో కేంద్రం జోక్యం కలిగించుకున్న తర్వాత కాంగ్రెస్, పి. యస్. పి, కాథలిక్ చర్చీలు కమ్యూనిస్టులపైనా, వారిసానుభూతిపరులపైనా మారణాయుధాలతో దౌర్జన్యాలూ దాడులు చేస్తున్నట్లు పలుతావులనుండి వార్తలు వస్తున్నాయి. ఇవి. త్రిచూరుజిల్లాలో ఉధృతంగా ఉన్నట్లు కూడా వార్తలు తెలుపుతున్నాయి.

త్రిచూరుజిల్లాలోని ఇరింజలకుడా వద్ద కిరకట్టుచెర్రిలో ఒక కమ్యూనిస్టును హత్య చేయటం, త్రిచూరులో [illegible] పాఠకులకు తెలిసిందే.

ఈ హత్యలకూ, దాడులకూ సంబంధించిన వివరాలు ఇప్పుడు చాలా తెలియవస్తున్నాయి.

పద్మనాభన్ అనే కమ్యూనిస్టు కిరకట్టుచెర్రిలో అతనితో పుట్టినవ్యక్తి వద్ద ఉండగా కాథలిక్ చర్చి, విమోచన సమర సమితికి చెందిన వందమంది ఆయుధాలను చేబూని ఆ యింటిని చుట్టుముట్టారు. పద్మనాభన్ తండ్రి, సోదరుడు, బావ [illegible] పారిపోగా, వెంటాడి [illegible] హింసించారు. అదే సమయంలో కమార్, పాట్టా, ఆలూరు, కింకట్టు చెర్రి కాథలిక్ చర్చీలలో గంటలు మ్రోగాయి. అనేకమంది కాథలిక్కులు కర్రలూ, బరిసెలూ పుచ్చుకొని [illegible] హరిజనులను పట్టుకు కొట్టారు. చాల సేపు గ్రామమంతా గగ్గోలుగా వుండిపోయింది. శ్రీ పద్మనాభన్‌ను పట్టుకొని హింసించారు. ఆయన ఆస్పత్రిలో చనిపోయారు. ఆయన తండ్రికీ, బావకూ బలమైన గాయాలు తగిలాయి.

అదేరోజున ఇరింజలకుడా గీత పనివారి సంఘం కార్యదర్శి, ముకుందపురం తాలూకా కమ్యూనిస్టు కమిటీ సభ్యుడూ అయిన శ్రీ కె. వి. కుమారన్‌పైనకూడా దాడిచేశారు. ఆయన తలపగిలింది. పక్కలకు గాయాలు తగిలాయి

చాలచోట్ల గీతపనివారి సంఘం క్రింద ఉన్న దుకాణాలమీదకూడా పెద్దపెట్టున దాడులు జరుగుతున్నాయి

కేరళ మంత్రివర్గాన్ని రద్దుచేశారన్న వార్త వినగానే 31 వ తేదీ రాత్రి మట్టాంచెర్రి, కల్లూర్తి మొదలగు అనేకచోట్ల కమ్యూనిస్టులపైనా, వారి సానుభూతిపరులపైనా దాడులు జరిగాయి. పి. యస్. పి. యువజనులుకూడా ఈ దాడుల్లో పాల్గొన్నారు. బొంబాయి హెయిర్‌కటింగ్ సెలూన్, జనతా హెయిర్‌కటింగ్ సెలూన్లపై దాడిచేసి అద్దాలు, సామానులు పగులగొట్టారు. షాపులోని వారిని హింసించారు. ఏ రాత్రిక

(మిగతా 4 వ పేజీలో)

కేంద్రజోక్యాన్ని కమ్యూనిస్టులు కోరనిమాట నిజమే

కాంగ్రెస్ పార్టీ సమావేశంలో లోగడ చేసిన ప్రకటనకు నెహ్రూ సవరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 4

కేరళలో కేంద్రం జోక్యం చేసుకోవాలని శ్రీ నంబూద్రిపాద్‌గాని, శ్రీ అజయఘోష్‌గాని తన్ను కోరనిమాట నిజమేనని ప్రధాని నెహ్రూ నేడు కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సవరణ చేసుకున్నారు.

అయితే పరిస్థితులను అదుపులో పెట్టలేమని కమ్యూనిస్టులు భావించే స్థితి ఏర్పడినమాట మాత్రం వాస్తవమన్నారు.

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో లోగడ శ్రీ నెహ్రూ మాట్లాడుతూ కమ్యూనిస్టులు కూడా కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరినట్లు చెప్పిన సంగతి పాఠకులకు విదితమే.

కాంగ్రెసు పార్లమెంటరీపార్టీ సమావేశం నేడు కూడా కొనసాగింది. శ్రీ నెహ్రూ నేటి సమావేశంలో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం జోక్యం కల్గించుకోవాలని కేరళ గవర్నరు సిఫారసు చేసినట్లు తెలియజేశారు.

కేరళలో ఇంచుమించు అంతర్యుద్ధ పరిస్థితి ఏర్పడటంవలననే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోడానికి నిర్ణయించిందని శ్రీ నెహ్రూ చెప్పుకొన్నారు.

కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని [illegible] కోరలేదని శ్రీ నంబూద్రిపాద్, శ్రీ అజయఘోష్ చేసిన ప్రకటనలను ప్రస్తావిస్తూ శ్రీ నెహ్రూ యిలా అన్నారు:

"కేంద్రం జోక్యం చేసుకోవాలని కమ్యూనిస్టులు కోరనిమాట నిజమే. అయితే కేరళ పరిస్థితులను అదుపు చేయలేమని కమ్యూనిస్టులు భావించేస్థితి ఏర్పడినమాట మాత్రం వాస్తవం.

కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ చట్టాన్ని అనుసరించి ఈ నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగచట్ట ఉద్దేశ్యాన్ని సార్థకం ఈ విధంగా చేసింది."

కేరళలో జోక్యం కలగచేసుకోవాలని అధ్యక్షుడు సంతృప్తిచెంది ఈ చర్యను తీసుకున్నారా లేక కేంద్ర ప్రభుత్వం సంతృప్తిమీద ఈ చర్యతీసుకున్నారా? అని ఒక సభ్యుడు ప్రశ్నించాడు.

దానికి నెహ్రూ సమాధానం చెబుతూ "ఇంగ్లండు రాజు లేక రాణి హోదా ఎటువంటిదో భారత రాష్ట్రపతి హోదా కూడా అటువంటిదేననీ, కేంద్రమంత్రివర్గం సంతృప్తిని ఆధారం చేసుకొనే రాష్ట్రపతి కేరళలో జోక్యం చేసుకున్నారనీ అన్నారు.

నేడు కేరళపై జరిగినచర్చలో తొమ్మిది మంది సభ్యులు పాల్గొన్నారు. వారందరూ ప్రభుత్వ చర్యను బలపరిచారు.

చర్చ జరుగుతున్న ఒక దశలో శ్రీ మహావీరత్యాగి మాట్లాడుతూ ప్రతి సభ్యుడూ ప్రభుత్వ చర్యను బలపరుస్తారనీ, అయితే ఈ చర్య పర్యవసానంగా ఏర్పడే పరిస్థితులు ఏవిధంగా ఉంటాయన్నదే సమస్య అనీ, ఇందుపై భిన్నాభిప్రాయం ఉందనీ అన్నారు.

మాట్లాడినవారిలో కొందరు కేరళ ముస్లింలీగ్ వంటి పార్టీలతో చేరరాదని వాదించారు. అక్కడ కుల, మత తత్వం ఎక్కువగా ఉందన్నారు.

దానికి నెహ్రూ జవాబు చెబుతూ కులమతతత్వం ఒక రాజకీయ పార్టీ రూపంలో అయితే ప్రమాదకరమైనదే నన్నారు. అయితే ఈ కులమత తత్వానికి, ఉత్తర దేశంలోని కులమత తత్వానికి తేడా ఉందన్నారు. ఉత్తరాదిలో కులమత తత్వాలు ద్వేషంవల్ల జనించితే కేరళలో ఒంటెత్తుతనం, వేర్పాటు తత్వాలవల్ల జనించినవన్నారు.

ఆంధ్ర సభ్యుడు శ్రీ ఎన్. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులకు మరికొంత అవకాశం యిచ్చి వున్నట్లయితే పరిస్థితులు వారికే కొరకరానివిగా తయారై గత్యంతరం లేక రాజీనామా యిచ్చి పోయేవారని అన్నారు.

ఆఖరున శ్రీ నెహ్రూ సమాధానం చెబుతూ కమ్యూనిస్టుల చేతికి ఒక నినాదం దొరుకుతుందని కేంద్రం జోక్యాన్ని ఆలస్యం చేయడం సాధ్యంకాదన్నారు. కేరళలో అశేష జనం ఇక్కట్లు పొందుతున్న పరిస్థితిలో, ఇంచుమించు అంతర్యుద్ధ పరిస్థితి ఏర్పడిన దశలో కేంద్రం జోక్యం చేసుకోవలసిన అవసరం కల్గిందన్నారు.

గవర్నరు నివేదికను లోక్‌సభకు సమర్పించడానికి హోం శాఖామంత్రి నిరాకరించిన ప్రసక్తి తేగా శ్రీ నెహ్రూ సమాధానం చెబుతూ గవర్నరు నివేదికను ఆధారం చేసుకొనే రాష్ట్రపతి ప్రకటన చేయబడిందనీ, కేంద్రం జోక్యం చేసుకోవాలని రాష్ట్ర గవర్నరు నొక్కిచెప్పారనీ అన్నారు. ఇంకా ఇలా అన్నారు:

"కేరళలో ఉన్న ప్రధాన రాజకీయపార్టీలు, కాంగ్రెసు, పి. ఎస్ పి కమ్యూనిస్టులు, రివల్యూషనరీ సోషలిస్టుపార్టీలు. ఇవేవీ కులమత పార్టీలు కావు. కాని ఏదో విధంగా ఈ పార్టీలకు కులమత భావాలు

(మిగతా 4 వ పేజీలో)

"మా" "దో బిఘా జమీన్"
"అపరాధి కౌన్" "మధుమతి"
వంటి మహత్తర కళాఖండాలను సమర్పించిన
బిమల్ రాయ్
మరో మహత్తర చిత్రం
సుజాత
నూతన్ - సునీల్ దత్
శశికళ - లలితాపవార్
దర్శకత్వం: బిమల్ రాయ్
సంగీతం: యస్. డి. బర్మన్
ప్రేక్షకులు, పత్రికలు, విమర్శకులు ముక్తకంఠంతో మెచ్చుకున్న యీ ఏటి మేటిచిత్రం
7-8-1959 శుక్రవారం నుండి
విజయవాడ - శేష్‌మహల్ | రాజమండ్రి - కృష్ణా
వివరములకు:
చిత్రా డిస్ట్రిబ్యూటర్స్
గవర్నరుపేట :: విజయవాడ-2

విశారి నామ సంవత్సర
శ్రావణ శుద్ధ
తదియ సా. 6-19
పుబ్బ సా. 6-30

విశాలాంధ్ర

శుక్రవారం 7-8-1959

శుభ వార్త

సోవియట్ ప్రధాని కృశ్చేవ్ అమెరికానుసందర్శించబోతున్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ సోవియట్ యూనియన్ సందర్శిస్తారు. ఆ విధంగా ఉభయులకు అంగీకారం కుదిరింది.

ఈ వార్త అపూర్వమైనది. ఈ ఘటన చరిత్రాత్మకం కానున్నది. అమెరికా సోవియటుయూనియన్లు రెండూ ప్రపంచంలోకల్లా మహత్తర శక్తిగల రాజ్యాలు. రెండూ రెండు ప్రపంచ విధానాలకు ప్రాతినిధ్యంవహిస్తున్నాయి. అవసానదశలోనున్న పెట్టుబడిదారీ విధానానికి నాయకత్వం వహిస్తున్నది అమెరికా. సోషలిస్టు నవయుగ వైతాళికుడుగా ఉద్భవించి, దినదినాభివృద్ధి చెందుతున్న సోషలిస్టు శిబిరానికి ముందునడుస్తున్నది సోవియట్ యూనియన్.

రెండవ ప్రపంచ యుద్ధంలో యీ రెండుశక్తులూ చేతులు కలిపి నిలవడంచేత ఫాసిస్టు శక్తులు హతమారాయి. ప్రజాశక్తులు పురోగమించాయి. కాని తర్వాత అమెరికా సహజీవన సిద్ధాంతాన్ననుసరించ నిరాకరించింది కమ్యూనిజాన్ని నిర్మూలించాలనే పేరిట ప్రపంచ వ్యాపితంగా సైనిక శిబిరాలు పెట్టింది. యుద్ధకూటాలు ఏర్పరచింది. శిథిలావస్థలోనున్న వ్యవస్థలను, కూలిపోతున్న ప్రభుత్వాలను సంరక్షించే పేరిట దేశదేశాల్లోనూ జోక్యం కలిగించుకుంది ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణాన్ని పెంపొందించి అనేక ఘర్షణలకు ఆస్కారమైంది.

విధానాలు వేరైనా సంగ్రామంద్వారాగాక సంప్రదింపుల ద్వారానే అంతర్జాతీయసమస్యలను పరిష్కరించుకోవచ్చునని అనేక సందర్భాల్లో రుజువైంది. అటువంటి పరిష్కారమార్గం కొరకై అగ్రరాజ్యాధిపతుల సమావేశం జరగాలనేది అందరూ అంగీకరించిన విషయం. ఆ సమావేశానికి ప్రాతిపదిక తయారు చేసేందుకై దీర్ఘకాలంగా జెనీవాలో జరుగుతున్న విదేశాంగమంత్రుల సమావేశం ముగింపుకు వచ్చింది. ఆ సమావేశం సమస్యా పరిష్కారానికి ఏ నిర్ణయాన్నీ చేయలేకపోవచ్చు. అయినా ఇప్పుడు వస్తున్న వార్తనుబట్టి అగ్రరాజ్యాధిపతుల సమావేశానికి అవకాశం కలిగించేదిగానే ఉమ్మడి ప్రకటన వుండవచ్చునని తోస్తోంది.

ప్రస్తుతానా కృశ్చేవ్ - ఐక్ ప్రత్యక్షంగా కలుసుకొని సంప్రదింపులు జరపడం గొప్పవిషయం. వారు ఏవిధమైన ఒప్పందానికీ ఒకవేళ రాలేకపోయినా కనీసం అగ్రరాజ్యాధిపతుల సమావేశం జరపడానికి ఆ ఇరువురి సంప్రదింపులు దోహదకారులౌ యని ఆశించవచ్చు.

అంతర్జాతీయ సమస్యల పరిష్కారం మాటెలావున్నా కృశ్చేవ్ - ఐక్‌ల పర్యటనలు సోవియట్-అమెరికా ప్రజలను తప్పక సన్నిహితుల్ని చేస్తాయి. ప్రపంచంలో ఉద్రిక్తత తగ్గడానికి బాగా తోడ్పడతాయి.

సోవియటు నాయకులు మికోయాన్, కోజ్లోవ్‌లు అమెరికా పర్యటించడం, అమెరికా ఉపాధ్యక్షుడు నిక్సన్ సోవియటు యూనియన్‌లో పర్యటించడం యీ రెండు దేశాల్లోనూ గొప్ప సుహృద్భావ వాతావరణాన్ని కలిగించాయి. ఇప్పుడీ కృశ్చేవ్-ఐసెన్‌హోవర్ల పర్యటన వార్త ఉభయదేశాల ప్రజలనుమరింత ఉత్సాహ పరుస్తున్నది.

ప్రపంచ శాంతిని కాపాడటంలో ప్రధానపాత్ర వహించవలసిన రెండు పెద్ద రాజ్యాల మధ్య సుహృద్భావ వాతావరణం కలగడం ప్రపంచానికే శుభసూచకంగా వున్నది. అందుకే కృశ్చేవ్ - ఐక్‌ల పర్యటనవార్త ప్రపంచ రాజధానీ నగరాలన్నింటా హర్షామోదాలు పొందింది.

ఆగస్టు 25 నుండి 31 వరకు "ఆహారవారం" జరపండి

కార్మికులకు ప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ విజ్ఞప్తి

విజయవాడ, ఆగస్టు 5

ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ సి. యల్. నరసింహం (యం. పి.) గారు ఈ విధంగా విజ్ఞప్తి చేస్తున్నారు:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చౌకడిపోలు ఏర్పాటుచేసి రూపాయకు 2½ శేర్ల చొప్పున బియ్యం ప్రజానీకానికి విక్రయం అందజేయాలని కోరుతూ ఆగస్టు ఆఖరువారం 'ఆహారవారం'గా జరపాలని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు (ఎ. ఐ. టి. యు. సి.) కార్యవర్గం నిర్ణయించింది. ఆ నిర్ణయంప్రకారం ఆగస్టు 25 నుండి 31 వ తేదీ వరకు ఆహారవారంగా ఇతర ప్రజా సంఘాలతో కలసి కార్మిక సంస్థలన్నీ ఐక్య ఆందోళనా పుద్యమం సాగించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈలోపుగా ప్రతి పారిశ్రామిక కేంద్రం, ప్రతి పట్టణంలోను ఈ క్రింది కార్యక్రమం అమలు జరపవలసిందిగా కోరుతున్నాను.

(1) ఇతర ప్రజాసంస్థలు, పార్టీలతో ఐక్య సమావేశాలు - సదస్సులు జరిపి ఐక్య ఆహారకమిటీలను ఏర్పాటు చేసి కార్యక్రమంనిర్ణయించుకోవాలి

(2) 'ఆహారవారం'లో ఊరేగింపులు - సభలు జరిపి చౌకడిపోల ద్వారా రూపాయకు 2½ శేర్ల బియ్యం అమ్మించాలని తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపాలి.

3. ఈవిధంగా ఆందోళన కార్యక్రమం సాగిస్తూ, ఆగస్టు 31 వ తేదీన జనరల్ సమ్మె, హర్తాళ్ జేసి ఐక్య ప్రదర్శనలు జరపాలి.

4. ప్రతియూనియన్ అత్యవసర సమావేశాలు జరిపి, కార్యవర్గ తీర్మానాన్ని ఆమోదిస్తూ తీర్మానం చేసి, ఆగస్టు 31 తేదీన సమ్మె చేయుటకు గాను ముందుగా యజమానులకు నోటీసులు యివ్వాలి.

5. ఆ రోజున తాలూకా, జిల్లా కేంద్రాలలోవున్న అధికార్ల దగ్గరకు వెళ్ళి మనకోర్కెలు తెలియజేసే మెమొరాండాలు ఇవ్వాలి.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని కార్మికసంఘాలు, యితర ప్రజాసంస్థలు పాల్గొనవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు తరఫున విజ్ఞప్తి చేస్తున్నాను.

అగ్నిప్రమాదంలో 5 గురు మరణం

మధురై, ఆగస్టు 5

ఇక్కడికి 50 మైళ్ళ దూరంలోవున్న శివకాశీ అగ్గిపెట్టెల ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం వాటిల్లిన ఫలితంగా అయిదుగురు స్త్రీ కార్మికులు చనిపోయారు. మరో నలుగురు వ్యక్తులకు తీవ్రమైన గాయాలు తగిలాయి

వరకట్నాల నిషేధం బిల్లు

లోక్‌సభలో చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు 5

వరకట్నాలను నిషేధించే బిల్లుపై నేడు లోక్‌సభలో చర్చ జరిగింది.

బిల్లును సంయుక్త సెలక్టు కమిటీకి పంపించాలంటూ న్యాయశాఖా మంత్రి ప్రవేశ పెట్టిన బిల్లును బలపరుస్తూ శ్రీమతి పార్వతీ కృష్ణన్ (కమ్యూనిస్టు), శ్రీ ఎ. బి. వాజ్‌పాయి (జనసంఘం), రాణి మంజులాదేవి (కాంగ్రెసు) ప్రసంగించారు. మాజీమంత్రి శ్రీ మహావీర త్యాగి (కాంగ్రెసు) బిల్లును వ్యతిరేకించారు.

బిల్లును బలపరుస్తూ మాట్లాడినవారు వరకట్నాలవలన మధ్యతరగతికి చెందిన కుటుంబాలు వివిధంగా నాశనం అవుతున్నాయో వివరించుతూ యీ సంఘ దురాచారాన్ని వెంటనే తుదముట్టించవలసిన అవసరాన్ని గురించి నొక్కి చెప్పారు.

వరకట్నాలను యివ్వడాన్నీ, స్వీకరించడాన్నీ ఈ బిల్లు నిషేధించుతుంది. అయితే పెండ్లి సమయంలో రెండు వేల రూపాయలకు మించని బట్టలు, యితర వస్తువులు బహుమతిగా యివ్వవచ్చు

కట్నాలను తీసుకొనేవారికి ఈబిల్లు ప్రకారం ఆరు నెలలు శిక్ష లేక అయిదు వేల రూపాయల జరిమానా లేక రెండూ విధించబడతాయి.

బొంబాయి కార్పొరేషన్‌లో సమితి నాయకత్వం

ప్ర. సో. పార్టీ సభ్యుల అవిధేయతకు నిరసనగా శ్రీ దొండే రాజీనామా

బొంబాయి, ఆగస్టు 5

బొంబాయి కార్పొరేషన్‌లో, పాలకవర్గ పార్టీ అయిన సంయుక్త మహారాష్ట్ర సమితిబ్లాక్ నాయకత్వానికి శ్రీ యమ్. వి. దొండే రాజీనామా యిచ్చారు. సమితి బ్లాకులోని అన్ని వర్గాలకు తన నాయకత్వంపై నమ్మకం వున్నట్లు లేదనీ, అందువల్లనే నాయకత్వపదవికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు

"ఇష్టంలేని సభ్యులపైనా నాయకత్వాన్ని రుద్దే దుడుకు నాకు ఇష్టంలేదు" అని ఆయన పేర్కొన్నారు.

[illegible] కాంగ్రెసువారు కార్పొరేషన్‌లో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకించాలని, సమితి నిర్ణయించింది సోమవారము నాడు ఆ తీర్మానంపై వోటింగు జరిగినప్పుడు సమితికి 55 వోట్లు, ప్రతిపక్షానికి 51 వోట్లూ వచ్చాయి. అయితే సమితిలోని అయిదుగురు సభ్యులు ఆనాడు గైరుహాజరయ్యారు వారంతా ప్రజాసోషలిస్టులే శ్రీ గోరేకూడా ప్రజాసోషలిస్టే. సమితి బ్లాక్ యిచ్చిన ఆదేశానికి విరుద్ధంగా వారు గైరుహాజరైనందున శ్రీ దొండే నాయకత్వానికి రాజీనామా పెట్టారు

అయితే తాను కార్పొరేషన్‌లో సమితిబ్లాక్‌కు ఎల్లప్పుడూ విధేయుడుగానే వుండగలనని శ్రీ దొండే తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

ఫైనల్ సర్టిఫికేట్ పరీక్షా ఫలితాలు

తిరుపతి, ఆగస్టు 3

1959 జూలైలో హైస్కూలు టీచర్లకు పెట్టిన ఫైనల్ సర్టిఫికేట్ పరీక్షలో ఈ క్రింది రిజిస్టరు నంబర్లు గలవారు ఉత్తీర్ణులైనట్లు శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీవారు ప్రకటిస్తున్నారు:

మేథమెటిక్స్

డిస్టింక్షన్‌తో ఉత్తీర్ణులు: 1 నుండి 5 8 9 11 నుండి 14 16 17 19 నుండి 24 26 నుండి 28.

ఉత్తీర్ణులు: 6 7 10 15 18 25 29

ఫిజికల్ సైన్సెస్

డిస్టింక్షన్‌తో ఉత్తీర్ణులు: 30 నుండి 35 37 38 40 41 43 నుండి 49

ఉత్తీర్ణులు: 36 39 42.

* * *

ఆగస్టు 15 శాంతియుత సత్యాగ్రహం జరపాలని మధ్యప్రదేశ్ "స్వాతంత్ర్య పోరాటయోధుల సంఘం" నిర్ణయించింది.

సుబ్రహ్మణ్యం లేఖఫొటో



PHONE NO. 250

[illegible] Subramania Ayyar
SENIOR ADVOCATE
SUPREME COURT.

[illegible] 3. 57

Confidential

My dear friend, As a private and personal matter, Can you please ascertain, if your Party will support me for one of the seats in the Rajya Sabha to be filled up shortly. You know I tried against Madhavan Nair (when M. N. stood) and lost [illegible] then your party gave me [illegible] votes [illegible] If you have [illegible] already [illegible] I think I can make a useful member and stand by your ideals but not [illegible] by active member. Please reply [illegible]

రాజ్యసభకు తనను ఎన్నుకోవడంలో కమ్యూనిస్టుపార్టీ సాయపడలేదని, కేరళ ప్రభుత్వంపై కక్ష కట్టిన సుప్రీమ్‌కోర్టు లాయర్ ఉదంతం

న్యూఢిల్లీ, ఆగస్టు 4

రాజ్యసభలో సభ్యత్వాన్ని పొందేందుకు కమ్యూనిస్టుపార్టీ సహాయపడ నిరాకరించిందనే కక్షతో కేరళ కమ్యూనిస్టు మంత్రివర్గానికి వ్యతిరేకంగా "పవిత్రయుద్ధం" సాగించిన కేరళ మాజీ అడ్వకేట్ జనరల్ ఉదంతాన్ని గురించి "బ్లిట్జ్" పత్రిక ఈ వారం కొన్ని సంగతులు బయట పెట్టింది.

కేరళ "ప్రజావెల్లువ"లో మన్నాత్ పద్మనాభన్ గాక మరొక నూతన "తార" బయటపడింది. ఆయన కేరళ మాజీ అడ్వకేట్ జనరల్. పేరు టి. సుబ్రహ్మణ్యఅయ్యర్. ఆయన ఇప్పుడు సుప్రీమ్‌కోర్టులో సీనియర్ అడ్వకేట్‌గా వుంటున్నారు.

కేరళ ప్రభుత్వం యిటీవల చేసిన భూసంస్కరణ బిల్లు వలన తనకుగల వందలాది యకరాలు పోతాయనే కక్ష కొద్దీ రంగంలోకి దిగారు. కేరళలో కేంద్రం జోక్యం కల్పించుకోవడం రాజ్యాంగ విరుద్ధమేమీ కాదని రాష్ట్రపతికి నచ్చజెప్పడానికి ఇటీవల ఢిల్లీకి వచ్చిన న్యాయవాదుల ప్రతినిధులలో ఈయన ఒకరు.

నాడు రోజులపాటు ఆయన ఢిల్లీలో మకాంపెట్టి కేంద్రమంత్రులు అందరినీ కలుసుకొన్నారు. ఆ తరువాత ఆయన ఒక బహిరంగసభలో కూడా ప్రసంగించారు. పత్రికలవారిని కూడా కలుసుకొన్నారు.

శ్రీ సుబ్రహ్మణ్యఅయ్యర్ పెద్ద లాయరుగానే గాక 'పెద్దమనిషి'గా కూడా పేరు పొందారు. అయితే ఆయన ఒక కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యునికి రహస్యంగా వ్రాసిన లేఖ బయటపడేటప్పటికి ఆయన 'పెద్దమనిషితనం' బట్టబయలు అయింది.

గత జనరల్ ఎన్నికల్లో కేరళలో కమ్యూనిస్టులు అత్యధికసంఖ్యాకులై ఎన్నుకోబడిన తరువాత వారి సహాయంతో పార్లమెంటు సభ్యత్వాన్ని పొందాలని సుబ్రహ్మణ్య అయ్యరుకు ఆశ కలిగింది. రాజ్యసభలో ఒక స్థానానికి తను నిలబడతాననీ, కమ్యూనిస్టు శాసనసభ్యుల వోట్లు తనకు యిప్పించి తోడ్పడాలని ఆయన ఒక కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యునికి రహస్య లేఖ వ్రాశారు. అందులో తాను రాజ్యసభకు ఎన్నికైతే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యాలకోసం కృషిచేస్తాననీ వాగ్దానంచేశారు. అయినప్పటికీ ఆయన వ్యక్తిగతభావాలు తెలుసు కాబట్టి ఆయనను బలపర్చడానికి కమ్యూనిస్టుపార్టీ నిరాకరించింది. దానితో ఆయన కమ్యూనిస్టుపార్టీకి ప్రబల శత్రువుగా తయారయ్యారు. భూసంస్కరణలబిల్లును ప్రవేశపెట్టడంతో ప్రత్యక్షంగానే రంగంలోకి దిగారు.

ఇరాక్ ప్రధానికి కృశ్చేవ్ ఆహ్వానం

బాగ్దాద్, ఆగస్టు 5

సోవియట్ సందర్శించవలసిందిగా సోవియటు ప్రధాని నికిటా కృశ్చేవ్ పంపిన ఆహ్వానాన్ని ఇరాక్ రిపబ్లిక్ ప్రధాని కాశిమ్ అంగీకరించారు.

విజయవాడలో రిక్షా కార్మికుల సౌశీల్యం

ప్రయాణీకులు పోగొట్టుకున్న సామాన్లను తిరిగి భద్రంగా ఒప్పగిస్తున్న వైనం

విజయవాడ, ఆగస్టు 5

విజయవాడలో అనేకమంది ప్రయాణీకులు పొరపాటున తమతమ సామాన్లను రిక్షాల్లో వదిలిపెట్టి దిగిపోవడమనేది అప్పుడప్పుడూ జరుగుతుంటుంది. అటువంటివారు రిక్షా కార్మికసంఘం ఆఫీసులో రిపోర్టు చేయడం, ఆ సామాన్లను స్వంతదార్లకు తిరిగి ఒప్పగించటం జరుగుతోంది.

ఈనెల ఒకటో తేదీన సుందర మధుసూదనరావు అనేవారు ఒక రిక్షాలో రు 510 ల సొమ్ము మర్చిపోయి యూనియన్‌కు రిపోర్టు చేయగా, అంతకు ముందే రిక్షా డ్రైవరు సదరు సొమ్మును తమ సంఘ కార్యదర్శి శ్రీ బెల్లపు శ్రీరాములుగారికి ఒప్పగించటం వల్ల, ఆ డబ్బు ఆయన కిచ్చివేసి రశీదు పుచ్చుకున్నారు.

కొట్లు ఇన్సూరెన్సు ఏజెంటు బి. నాగభూషణం అనేవారు రు 150/- లు, కొన్ని ఫైళ్ళు రిక్షాలో మరచిపోగా, అన్నీ వారికి వాపస్ యిచ్చారు.

మరొకరు క్రిందటినెల 30 వ తేదీన 457 రూపాయలున్న సంచిని రిక్షాలో మరచిపోయారు. రిక్షా డ్రైవరు దాన్ని తీసికెళ్ళి యజమాని కిచ్చాడు

అటుతర్వాత సొత్తుదారు [illegible] చేస్తూండగా, ఆసంగతి తెలిసి రిక్షా కార్మికుడు ఆ డబ్బును యజమానివద్దకు తీసుకెళ్ళాడు. అదంతా వృత్తిదని యజమాని బుకాయించడం మొదలెట్టాడు. దాంతో పోలీసు రిపోర్టివ్వడం, స్టేషనుకు పిలిపించి వారు ఒత్తిడి చేయటం, సొమ్మంతా వాపస్ చేయటం జరిగింది. సొత్తుదారు రిక్షా డ్రైవరుకు పారితోషికం రూపాయలు బహూకరించారు. అలాగే మొదటివారు యిరవై రూపాయలు, రెండవవారు అయిదురూపాయలూ రిక్షా కార్మిక సంఘానికి విరాళాలిచ్చారు.

పంచాయితీసమితి, జిల్లాపరిషత్తులకు ప్రత్యక్ష ఎన్నికలుండాలి

శాసనసభలో శ్రీ బద్దం ఎల్లారెడ్డి ఉద్ఘాటన

హైదరాబాద్, ఆగస్టు 6

పరిపాలనా వ్యవస్థపై కాంగ్రెసు పార్టీకిగల గుత్తాధికారానికి దెబ్బతగలకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పంచాయితీ సమితులకు, జిల్లాపరిషత్తులకు ప్రత్యక్ష ఎన్నికలపద్ధతిపై ఏర్పాటుచేయడానికి నిరాకరిస్తున్నదని కమ్యూనిస్టు ప్రజాతంత్రవర్గసభ్యుడు శ్రీ బద్దం ఎల్లారెడ్డినేడు శాసనసభలో విమర్శించారు.

సెలక్టు కమిటీ శాసనసభకు తిరిగి పంపించిన ఆంధ్రప్రదేశ్ పంచాయితీ సమితుల, జిల్లా పరిషత్తుల బిల్లుపై ప్రతిపక్షాల తరఫున చర్చప్రారంభిస్తూ శ్రీ ఎల్లమందారెడ్డి ఇంకా యిలా అన్నారు:

"తెలంగాణా ప్రాంతాలలో ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల వల్ల ఒక్కవిషయం స్పష్టమయింది. కాంగ్రెసుపార్టీ అక్కడి భూస్వామి వర్గానికి, పాతకాలపు జమీందారీ వర్గానికి అండగా నిల్చింది. కుల మత తత్వాలను రెచ్చగొట్టి ఎన్నికలకై వీటిని ఉపయోగించుకొన్నది. ఈ పరిస్థితుల్లో వెనుకబడిన ప్రాంతాలలో సాధారణంగా, స్థానిక భూస్వామి వర్గాలలోంచో వారి ప్రతినిధులో పంచాయితీ అధ్యక్షులుగా ఎన్నికవుతారు. కాబట్టి పంచాయితీ సమితుల్లో వీరే సభ్యులవుతారు. ఇటువంటివారితో ఏర్పడిన సమితులు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించజాలవు.

పంచాయితీ సమితులు, జిల్లా పరిషత్తులు ప్రజలకు ప్రాతినిధ్యం వహించే సంస్థలుగా వుండాలంటే వీటికి ప్రత్యక్ష ఎన్నికలు జరగాలి. కాని ప్రజాతంత్రయుతమైన ఈ ప్రతిపాదనను ప్రభుత్వం త్రోసివేసింది. కనీసం పంచాయితీలలోని సభ్యులైనా ఈ ఎన్నికల్లో పాల్గొనాలని చేసిన సూచనను కూడ ప్రభుత్వం తిరస్కరించింది. ఈ ప్రతిపాదనను అమలు జరిపితే, ఈ సంస్థల్లో తమకున్న గుత్తాధికారానికి దెబ్బ తగులుతుందనే భయమో, అనుమానమో ప్రభుత్వానికి పట్టుకొందని స్పష్టమవుతోంది.

ప్రత్యక్ష ఎన్నికలుపెడితే బోలెడు డబ్బు ఖర్చవుతుందని ప్రభుత్వం సాకు చూపుతున్నది. అయితే, అధికార వికేంద్రీకరణ మాటేమి? గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాది ఏర్పాటాలంటే ప్రజలపై విశ్వాసముంచాలి. అందుకు అనుగుణమైన విధానాలు చేపట్టాలి. అలా కాక, తమ స్వార్థానికి దెబ్బ తగలకుండా ఒకవైపు జాగ్రత్తపడుతూ సత్ఫలితాలు కలగాలంటే ఎలా కలుగుతాయి. ఇప్పటి పద్ధతిలో ఏర్పడే ఈ పంచాయితీ సమితులు, జిల్లా పరిషత్తులు ఏదో సాధిస్తాయని ఆశపెట్టుకోవడం ఆత్మవంచనే అవుతుంది

హరిజనులు స్త్రీల ప్రాతినిధ్యం

పంచాయితీ సమితుల్లో హరిజనులకు, స్త్రీలకు సరియైన ప్రాతినిధ్యం లేదు. వెనుకబడిన ఈ తరగతులకు ఈ సంస్థల్లో సరియైన ప్రాతినిధ్యముండాలంటే, వీరికి సీట్లు కేటాయించడమో, లేకదామాషా ఓటింగుపద్ధతి ప్రవేశపెట్టడమో జరగాలి. దామాషా ఓటింగు పద్ధతిని అమలుజరిపితే, ఆయా ప్రాంతాల్లోని రాజకీయ పార్టీలకు వాటి బలాబలాలనుబట్టి ఈ సంస్థల్లో స్థానముంటుంది. ఈ విధంగా అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను ఈ సంస్థలు ప్రతిబింబించగలవు.

ఎన్నికలు జరగనట్టి రద్దయినట్టి పంచాయితీల తరఫున ప్రతినిధులను కలెక్టరు నియమించాలనే నిబంధన ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమైనది. ఈ నిబంధన బిల్లులో చేర్చడానికి కారణమేమి? పంచాయితీ సమితుల్లో తమకు మెజారిటీ లేనప్పుడో లేక ప్రతిపక్షం వారికికూడా సమానమైన బలం వున్నప్పుడో, తమకు వ్యతిరేకంగా వున్న పంచాయితీలను రద్దుచేసి వాటి తరఫున తమవారిని పంచాయితీ సమితుల్లో నియమించడానికే ఈ క్లాసు ఉపయోగపడుతుంది దీన్ని బిల్లునుండి తొలగించాలి.

శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి: ఇవన్నీ వట్టి అనుమానాలు.

శ్రీ పి. సుందరయ్య: వట్టి అనుమానం కాదు. పంచాయితీ సమితులు ఏర్పాటయిన ప్రాంతాల్లో అన్ని పంచాయితీలకు తప్పనిసరిగా ఎన్నికలు జరగాలని అందరూ అంగీకరించినా కొన్నిచోట్ల అదేపనిగా పంచాయితీ ఎన్నికలు జరుగకుండా నిలుపుదల చేశారు. ముఖ్యమంత్రి ఈమాట అన్నారు కాబట్టి ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించడానికి మాకు తగు కారణాలున్నాయి.

తరువాత శ్రీ ఎల్లారెడ్డి తమ ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఇలాఅన్నారు:

"పంచాయితీ సమితుల్లో శాసన సభ్యులను సభ్యులుగా చేసి, అందులో వారికి ఓటుచేసే హక్కు లేకుండా చేయడం దారుణం. ఇది వారికి అవమానకరమయిన విషయం కూడా. ఒక శాసనసభ్యుని నియోజకవర్గానికి సంబంధించిన రెండుమూడు పంచాయితీ సమితులుండవచ్చుననీ, వీటన్నిటిలో సభ్యుడుగా వుంటాడు కాబట్టి ఇతనికి ఓటింగు హక్కుండకూడదనే వాదన తెస్తున్నారు. అయితే, జిల్లా పరిషత్తుల్లోని పార్లమెంటు సభ్యుల కెందుకు ఓటింగుహక్కు ఇచ్చారు. ఒక పార్లమెంటు సభ్యుని నియోజకవర్గం రెండు జిల్లాల్లోవుండే వుదాహరణ అన్నాయిగదా?

అయితే ఏ జిల్లా పరిషత్తులో సభ్యుడుగా ఉండదలచాడో, పార్లమెంటు సభ్యుడు నిర్ణయించుకోవచ్చునంటున్నారు. అలాంటి హక్కు శాసనసభ్యునికికూడా యివ్వాలి.

జిల్లా పరిషత్తులకు, పంచాయితీ సమితులకు, వీటన్నిటికీ ప్రత్యక్ష ఎన్నికలు పెడితే, ఈ సంస్థలకు అన్యోన్య సంబంధాలు తెగిపోతాయనీ, ఇవన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడిన సంస్థలనీ, ప్రభుత్వం చేస్తున్న వాదనలో పసలేదు. పార్లమెంటుకు, శాసనసభకు ఒకేసారి ప్రత్యక్ష ఎన్నికలు జరగడంలేదా? రాష్ట్రస్థాయిలోనూ, అఖిలభారత స్థాయిలోనూ ఏర్పాటు చేసినఈ పరిపాలనా వ్యవస్థలకు ఇందువల్ల భంగకలిగిందా?

జిల్లా పరిషత్తులకు కలెక్టరు అధ్యక్షుడుగా వుండకూడదని సభ్యులు చెప్తున్నదానికి చెవియొగ్గి ఈ పదవికి ఎన్నికలు జరిపించాలని ప్రభుత్వంనిశ్చయించినట్లు శ్రీ బ్రహ్మానందరెడ్డి చెప్పారు. అయితే ఎడమచేత్తో ఇచ్చింది కుడిచేతితో తీసుకొన్నారు. జిల్లా పరిషత్తులు ఎన్నుకొనే అన్ని స్థాయీ సంఘాలకు కలెక్టరే అధ్యక్షుడుగా వుంటారనే అంశాన్ని బిల్లులో చేర్చారు. ఇది మరింతదారుణమైన విషయం. నిజమైనఅధికారమంతా ఈస్థాయీసంఘాలది. అందువల్ల ఎన్నికైన అధ్యక్షుణ్ణి ఉత్సవ విగ్రహంగా చేశారు; మూలవిరాట్టు కలెక్టరు. ఎన్నికయినఅధ్యక్షుడు ప్రారంభోత్సవాలు జరపడానికీ, పూలమాలలు స్వీకరించడానికిమాత్రమే పనికి వస్తాడు."

పంచాయితీ సమితి అధ్యక్షులకు ఇతోధికారాలు ఇస్తూ సెలెక్టు కమిటీ చేసిన మార్పులు మంచివని శ్రీ ఎల్లారెడ్డి అన్నారు. కాని ప్రతిపక్షంవారు సూచించిన ప్రధానమైన మార్పులు ప్రభుత్వ పక్షం అంగీకరించనందువల్ల, వీటివల్ల ప్రజలకు చేకూరే లాభం స్వల్పమని శ్రీ ఎల్లారెడ్డి తన ఉపన్యాసం ముగించారు.

శాసనసభలో ప్రశ్నోత్తరాలు:

హరిజన స్త్రీని గాడిదపై ఊరేగించిన కిరాతకత్వం

హైదరాబాద్, ఆగస్టు 5

మహబూబ్‌నగర్ తాలూకా రాజపూర్ గ్రామంలో, భీమమ్మ అను హరిజనస్త్రీని, గ్రామ పంచాయితీ సభ్యులు గాడిదపైన ఊరేగించి, ఊరి నుండి వెళ్ళగొట్టిన విషయం ప్రభుత్వానికి తెలియవచ్చిందనీ, పంచాయితీదార్లపై ఐ. పి. సి. 294 సెక్షన్ క్రింద పోలీసులు కేసు పెట్టారనీ శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారి ప్రశ్నకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు.

చెరకు ఉత్పత్తిదారులకూ, పంచదార ఫ్యాక్టరీ యజమానులకూ మధ్య తగాదాలు రాకుండా చేయడానికి మధ్యవర్తి కమిటీలను ఏర్పాటుచేయాలని ప్రభుత్వంఆలోచిస్తున్నట్లు వ్యవసాయ మంత్రి శ్రీ తిమ్మారెడ్డి, శ్రీ గున్నయ్య ప్రశ్నకు సమాధానమిస్తూ అన్నారు ఈ కమిటీలో ఇద్దరురైతు ప్రతినిధులు ఇద్దరు ఫ్యాక్టరీ యజమానుల ప్రతినిధులు, చెరకు ఇన్‌స్పెక్టరు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉంటారన్నారు.

శ్రీ మహమ్మద్ తహశీల్ అడిగిన ప్రశ్నకు విద్యామంత్రి శ్రీ పట్టాభిరామారావు 58--59 లో [illegible]లకై ఏజెన్సీప్రాంతాలలోని హరిజనుల నుండి దరఖాస్తులు రాలేదని అన్నారు

దర్శి తాలూకాలో 58-59 లో విస్తృత సహకార సంఘాలను రిజిస్టరు చేయవలసిందిగా రెండు దరఖాస్తులు వచ్చాయని, ఈ రెండు దరఖాస్తులు మంజూరయినవని శ్రీ కాశిరెడ్డి ప్రశ్నకు సహకార శాఖామంత్రి సమాధానమిచ్చారు

కేరళలో ప్రతిపక్షాలవారు జరుపుతున్న దారుణాలు

శ్రీ ఎ. కె. గోపాలన్ పత్రికా ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 5

కమ్యూనిస్టుపార్టీ నాయకుడు శ్రీ ఎ. కె. గోపాలన్ నేడొక పత్రికా ప్రకటనచేస్తూ కేరళలోని అనేక ప్రాంతాల్లో వ్యతిరేకపక్షాలకు చెందిన వలంటీర్లు కమ్యూనిస్టుల, వారి సానుభూతిపరుల ఇండ్లను దోచుకొంటున్నట్లు, దాడిచేస్తున్నట్లు, ఖూనీలు జరుపుతున్నట్లు, స్త్రీలను మానభంగం చేస్తున్నట్లు తెలిపే [illegible] గ్రామాలు అనేకం తనకు చేరాయని తెలిపారు.

ఉత్తర మలబారులోని [illegible]లో డైనమైట్‌ను ఉపయోగించినట్లు తెలిపే ఒక టెలిగ్రామ్ తనకు వచ్చినదనికూడా అన్నారు. అనేక యిండ్లను ధ్వంసం చేశారు. అనేక మందిని గాయపరిచారు. అలెప్పీలో ఇద్దరు స్త్రీలను మానభంగం చేశారు. ఇలాంటి దారుణాలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయి. భారత ప్రభుత్వమూ, ముఖ్యంగా ప్రధాన మంత్రి కమ్యూనిస్టులు ఈ ప్రపంచంలో బ్రతికే హక్కును కావాలని నిరాకరిస్తున్నారేమో నాకు అర్థం కావడంలేదు.

ఈ ఘటనలన్నింటిపై దర్యాప్తు జరిపించి అవసరమైన చర్యలను తీసుకోవలసిందిగా విజ్ఞప్తిచేస్తూ కేరళ గవర్నరుకు తాను వ్రాసిన లేఖను శ్రీ గోపాలన్ ఆ తరువాత పత్రికలకు విడుదల చేశారు

* * *

కేరళలోని ప్రభుత్వ బస్ సర్వీసులో ఆగస్టు 15 నుండి కొత్త ఛార్జీలను నిర్ణయించనున్నారు.

కెనడా ప్రధానికి శ్రీ నెహ్రూ లేఖ

లావోస్ పరిస్థితిపై

ఒట్టావా, ఆగస్టు 5

లావోస్ పరిస్థితినిగూర్చి ప్రధాని నెహ్రూ కెనడా ప్రధాని డిఫెన్‌బేకర్‌కు ఒక లేఖ వ్రాశారని నేడు కెనడా పత్రికలు ప్రకటించాయి.

లావోస్‌లోని అంతర్జాతీయ పర్యవేక్షకసంఘాన్ని తిరిగి సమావేశపరచ వలసిన అవసరాన్నిగూర్చి శ్రీ నెహ్రూ ఆ లేఖలో తెలిపినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ సంఘానికి భారతదేశం అధ్యక్షురాలు. కెనడా, పోలెండులు సభ్యదేశాలన్న సంగతి పాఠకులకు విదితమే

లావోస్ ప్రభుత్వ అనుమతిలేకుండా అంతర్జాతీయ సంఘాన్ని సమావేశపరచరాదని కెనడా వాదన. ఈ విషయంలో కెనడాప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోబోదని తెలుస్తోంది.

లావోస్‌లో అత్యవసర పరిస్థితి

రాచరిక ప్రభుత్వ ప్రకటన

సింగపూర్, ఆగస్టు 4

లావోస్ రాచరిక ప్రభుత్వం నేడు దేశంలోని అయిదు రాష్ట్రాలలో అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లు ప్రకటించింది.

శ్రీ భగవద్గీత

ఎడమప్రక్క శ్లోకములును, కుడిప్రక్క శ్రీరామానుజ భాష్యము ననుసరించిన విశేషార్థములతోడి వ్యాఖ్యానములును గలవు. రు. 1-4-0. పోస్టేజి ప్రత్యేకము.

తప్పాపి నరసింహాచార్యులు,
సీతారామపురము,
గన్నెలగుంటపోస్టు, గుంటూరుజిల్లా.

బొగ్గు

పెద్ద మొత్తములో బొగ్గును మద్రాస్‌లో డెలివరీ యిచ్చుటకు రెగ్యులర్‌గా లారీలపై సప్లయి చేయువారు కావలయును. ఈ క్రింది వారిని కాంటాక్టు చేయండి.

బుహారీ సన్స్ ప్రయివేట్ లిమిటెడ్
1-ఎ. గాంధి ఇర్విన్ రోడ్ ఎగ్మూర్,
మద్రాసు - 8.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో

ప్రకటన

విజయవాడ నించిపేట వాస్తవ్యులు శ్రీ కె. జెడ్. ఖాన్ అనువారు మాచే [illegible] పుస్తకముల అమ్మకమునకు అర్హత తెచ్చి నం. 101 నుండి 150 గల మా ఆర్డరు పుస్తకము తీసుకొనినట్లు యింతవరకు జాడ తెలుపక యున్నందున సదరు పైనెంబర్లుగల మా ఆర్డరు పుస్తకము రద్దు పర్చటమైనది. వారితో ఎవరైనా యిప్పటికి ఆర్డర్లు ఇచ్చియున్నను లేక యిక ముందు ఇచ్చినా మా కెలాంటి బాధ్యత లేదని తెలియజేయుచున్నాము.

జి. రంగనాయకులు,
యస్. యస్. పెర్ఫ్యూమరీస్,
మోదుకూరు, గుంటూరుజిల్లా.

కొటేషన్లు కావలెను

కృష్ణాజిల్లా దివితాలూకా ఉల్లిపాలెం గ్రామ పంచాయితీకి ఈ దిగువ కనబరచిన కొలతలు గల సిమెంటుతూములు సప్లయిచేయుటకు గాను ది 10-8-59 వ తేదీ సాయంత్రం 3 గంటలవరకు సీల్డు కొటేషనులనండి మాత్రము కోటేషన్లు సదరు పంచాయితీ ప్రెసిడెంటుగారిచే తీసుకొనబడును. ఇతర వివరములు ఉల్లిపాలెం పంచాయితీ ఆఫీసు పనిచేయు కాలములో తెలిసికొనవచ్చును.

సప్లయి వివరము:
1. 1 అ. డయామీటరు 6 అ. పొడవుగల తూములు 24.

(సం.) యస్. అమ్మయ్య,
ప్రెసిడెంటు; ఉల్లిపాలెం గ్రామ పంచాయితీ, దివితాలూకా, కృష్ణాజిల్లా.

ప్రజాస్వామ్యంగొంతు నులిమిన 'పండితుడు'

ప్రధాని నెహ్రూపై సోషలిస్టు డెమాక్రటిక్ పార్టీనాయకుని విమర్శ

అనంతపురం, ఆగస్టు 4

భారతప్రధాని పండిత నెహ్రూ కేరళలో ప్రజాస్వామ్యమనే పసిబిడ్డ గొంతును నులిమిచంపి, భ్రూణహత్యకు పాల్పడ్డారని, నిన్న అనంతపురంలో జరిగిన బహిరంగసభలో ఆంధ్రప్రదేశ్ సోషలిస్టు డెమోక్రటిక్ పార్టీ కార్యవర్గసభ్యుడు శ్రీ డి. అశ్వత్థప్పగారు (అడ్వొకేట్) తీవ్రంగా విమర్శించారు.

పట్టణ కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన ఈ బహిరంగసభ జరిగింది. స్థానిక అడ్వొకేట్ శ్రీ సి. నరసింగరావుగారు అధ్యక్షత వహించారు.

సభాధ్యక్షులు ఉపన్యసిస్తూ, భారత ప్రజాస్వామికానికి ముప్పు కేరళలో ప్రారంభమైందన్నారు.

తర్వాత శ్రీ అశ్వత్థప్పగారు యిలా మాట్లాడారు:

"కేరళలో కేంద్రం జోక్యం చేసుకోవడం ఒకకమ్యూనిస్టుపార్టీకే సంబంధించిన సమస్యకాదు. ఇది పార్టీలకు అతీతమైన సమస్య. పండిత నెహ్రూ ప్రజాస్వామికం భారతదేశంలోనే వున్నదంటూ నీతులు చెప్తుంటారు. కాని రాజ్యాంగ చట్టాన్ని ధిక్కరించి 356 సెక్షను క్రింద జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికే వ్యతిరేకం.

"కేరళ ప్రజలను వోటిడీ చేస్తున్న కుల మత శక్తులతో కాంగ్రెసు చేతులు కలిపి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసింది. వెనుక సంజీవరెడ్డిగారు ఈ పూరిలోనే ఒక సభలో మాట్లాడుతూ ఎంతమంది కుంటివాళ్ళు కలిస్తే ఒక మంచివానికి సమానమౌతారని విమర్శించారు. కాని ఈనాడు కేరళలో కుల, మత శక్తులతో ఐక్యమై సౌజన్యంగా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని పడగొట్టారు.

సంజీవరెడ్డి రాజీనామా ఇవ్వాలి

"1957 ఎన్నికల్లో ఆంధ్రలో ఐక్య కాంగ్రెసు పేరిట సంజీవరెడ్డి మంత్రివర్గం ఏర్పడింది. ఈనాడు ఐక్య కాంగ్రెసులోని లోక్‌పార్టీ, ప్రజాపార్టీలు విడిపోయినాయి. నీతికలిగిన కాంగ్రెసు అయితే ఈనాడు సంజీవరెడ్డి మంత్రివర్గం రాజీనామా ఇవ్వాలి. కేరళలో కమ్యూనిస్టులు స్వంత బలంతోనే ప్రభుత్వాన్ని ఏర్పరచితే ఓర్వలేకపోయారు.

ఇంక కేరళ మంత్రివర్గంపై చేసిన నిందలు చూస్తే ఆశ్చర్యమౌతుంది. అన్ని కమిటీలలోను అధికసంఖ్యాకులు కమ్యూనిస్టులు వున్నారట! ఇక్కడ ప్రతి కమిటీలోను కాంగ్రెసువారిని తమ గ్రూపువారిని తప్ప యితరులను వేయుడంలేదు. ఒక్కటే ఉదాహరణను తీసుకోండి. కాలేజి కమిటీలో శ్రీ టి. చిరంజీవి గారిని, శ్రీ సందా నారాయణప్పగారిని వేశారు. [illegible] జిల్లాలకి [illegible] తెగించినవారిని కమిటీలలో వేశారు. మార్కెట్లను పట్టి కాశ, తమచుట్టూ తిరిగినవారికి సీట్లను పంచిపెట్టి రాబోయే ఎన్నికలలో తమ బలాన్ని పెంచుకుంటున్నారు.

చిత్తూరు బ్యాంకులో తమవాడు అధ్యక్షుడు కాలేదని రద్దు చేశారు. గుంటూరు మార్కెటింగు సొసైటీకి తమ గ్రూపువాడు మంతెన వెంకట్రామను నామినేటుచేసి అప్పజెప్పారు. కడపలో ఒక సహకారసంస్థ డైరెక్టర్లను రెండుసార్లు నామినేటుచేసి, భాగాలు కుదరక యిప్పుడు ఎన్నికలంటున్నారు. కేరళలో సర్వీసు కమిషను బోర్డుకు కమ్యూనిస్టుపార్టీ సభ్యుడు శ్రీ భాస్కరపణిక్కరును నామినేటు చేసినందుకు ఒక నేరంగా భావిస్తున్నారు. కేంద్రసర్వీసుకమిషనుబోర్డుకు శ్రీ శివమణ్యంపిళ్ళైను పెట్టినది మీకు తెలుసు. శ్రీ తరిమెల నాగిరెడ్డిగారితో ఓడిపోయిన శ్రీ పైడి లక్ష్మయ్యగారిని ఓడిన వెంటనే ఎండోమెంటు బోర్డు కమిషనరుగా నియమించినది అందరికీ తెలుసు.

ప్రజావెల్లువకు ఏవి గీటురాయి?

కేరళలో ప్రజావెల్లువ పేరుతో ప్రభుత్వాన్ని రద్దు చేశారు. ప్రజావెల్లువకు గీటురాయి అరాజకం పనులే ఐతే యెవరైనా చేయవచ్చు. కమ్యూనిస్టుల సత్తా మనకు తెలుసు. తెలంగాణా వంటి పోరాటం తెస్తే కాంగ్రెసు యేమౌతుందో ఊహించుకోవలసిందని కోరుతున్నాను.

"కేరళ ఉపఎన్నికలో కమ్యూనిస్టులు గెలిచినారు. ఆంధ్రలో జరిగిన 10 ఉప ఎన్నికలలో 7 స్థానాలు కాంగ్రెసు పోగొట్టుకున్నది. గుంటూరు, విజయవాడ మునిసిపాలిటీలు పోయినాయి. ప్రజాస్వామికానికి గీటురాయి ఎన్నికలైతే సంజీవరెడ్డి మంత్రివర్గం రాజీనామా యివ్వవలసి వుంటుంది.

ఇంగ్లాండు వంటి ప్రజాస్వామిక దేశాల్లో అయితే మంత్రులపై యేదైనా నిందవస్తే రాజీనామాపెట్టి నిజాయితీని రుజువు చేసుకొని మరల ఎన్నికలకు నిలబడుతారు. మన కాంగ్రెసు ప్రభుత్వాలు ప్రజలు యెంత "ఛీ" అని వస్తున్నప్పటికీ సిగ్గుపడక పదవుల్లో వుంటారు.

మంత్రులు రావచ్చు, పోవచ్చు, రాజ్యాంగం స్థిరస్థాయిగా వుంటుంది. ఏ పార్టీకయినా, వ్యక్తికయినా ఓటుతో ప్రభుత్వానికి వచ్చే హక్కు వుంది. దీనిని యెవరూ తీసివేయలేరు. తీసివేస్తే ఆయూబ్‌ఖాన్ ప్రభుత్వం వస్తుంది. అప్పుడు ప్రజలు ఇతర విధానాలు ఆలోచించక తప్పదు.

"పండిత నెహ్రూ ప్రజాస్వామికమనే పసిబిడ్డగొంతు పిసికి చంపి భ్రూణహత్యకు పాల్పడ్డారు. దీనిని ప్రజాస్వామిక వాదులంతా ఖండించాలని కోరుతున్నాను" అని ముగించారు.

తర్వాత కమ్యూనిస్టు జాతీయ సమితి సభ్యులు శ్రీ నీలం రాజశేఖరరెడ్డిగారు ఉపన్యసిస్తూ ఇలా అన్నారు:

"భారత దేశంలోని పెద్దపట్టణాలైన కలకత్తా, బొంబాయి, ఢిల్లీ, మద్రాసు, కోయంబత్తూరు, మదురై మొదలగు పట్టణాలు కాంగ్రెసు పట్టునుండి జారిపోయినాయి. దేశంలోని అనేక ఉపయెన్నికలలో కాంగ్రెసు ఓడిపోయింది. ఈ బలహీనతను కాంగ్రెసు గుర్తించింది. భయం ఆవరించింది. ఆ భయంతోనే కేరళలో ప్రజాస్వామికాన్ని ఖూనీ చేసింది." అన్నారు.

ప్రజాస్వామ్య వ్యతిరేకంగా కేరళలో రాష్ట్రపతి పాలనను ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

శ్రీ రంగనాయకులుగారి వందన సమర్పణతో సభ ముగిసింది.

రేడియో

శనివారం, ఆగస్టు 8

విజయవాడ

ఉదయం: 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు, వాద్యసంగీతము; 6-40 భక్తిరంజని; 7-0 తె. వా; 7-15 ఎ. వి. ఎస్. కృష్ణారావు; 7-45 సంగీత శిక్షణ; 8-0 ఆం. వా; 8-15 హిం. వా; మధ్యాహ్నం: 12-30 కార్మికులకు (హై. నుండి రిలే); 1-0 వనితావాణి; 1-30 లలిత సంగీతం; 1-50 తె. వా; 2-0 లలిత సంగీతం; 2-20 బొమ్మరిల్లు పిల్లల కార్యక్రమం; సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 గ్రాం. వార్తలు; 6-15 గ్రామస్థులకు; 7-0 తె వా; 7-15 గ్రామస్థులకు; 7-30 హిందీ సాహిత్యము ప్రజభావ, గీతసాహిత్యము - ప్రసంగము; 7-40 ఫిల్మ్ సంగీతం; 8-0 జానపద గేయోత్సవము; 8-30 రేడియోన్యూస్‌రీల్; 8-40 సుగమ్ సంగీత్; 8-45 రవీంద్ర సంగీత్; 9-0 ఆం. వా; 9-15 హాస్యవల్లరి (హై. నుండి రిలే); 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం - (ఢిల్లీ నుండి రిలే); 11-0 సమాప్తి.

హైద్రాబాద్ - (బి)

ఉదయం: 6-30 సుప్రభాత్; మధ్యాహ్నం: 12-30 కార్మికులకు; 2-10 [illegible]; 2-20 బొమ్మరిల్లు- పిల్లల కార్యక్రమం (విజయవాడనుండి రిలే): సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు; 6-15 గ్రామస్థులకు; 7-0 తె. వా; 7-15 గ్రామస్థులకు; 7-30 హిందీ సాహిత్యము - (విజయవాడ నుండి రిలే); 7-40 లలిత సంగీత్; 7-50 శ్రోతల ఉత్తరాలకు జవాబులు; 9-15 హాస్యవల్లరి - నిజం చెప్తే నష్టం నాటిక: 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం (ఢిల్లీనుండి రిలే); 11-0 సమాప్తి.

బజారు ధరలు

విజయవాడ, ఆగస్టు 6
[మధ్యాహ్నం గం॥ 1 వరకు]

	బంగారం ధరలు	
కొలిమి: పాత		119 8 0
మేలు		118 12 0
నవరసు		79 4 0
వెండి: 100 తులములు		194 8 0
తులము		2 0 0
	ధాన్యం ధరలు	
24 నెంబరు		రు 32 0 0
వంకసన్నాలు		30 0 0
12 నెంబరు		29 8 0
అక్కుళ్ళు		27 4 0
కిచిడి		27 10 0
	బియ్యం ధరలు	
24 నెంబరు		రు. 72 0 0
వంకసన్నాలు		69 0 0
12 నెంబరు		66 0 0
అక్కుళ్ళు		65 0 0
కిచిడి		64 0 0
	అపరాల ధరలు	
మినుములు 240 శే॥		57 8 0
కందులు		58 0 0
పల్ల పెసలు (మాగాణి)		60 0 0
పచ్చ పెసలు 230 శే॥		55 0 0
పచ్చ పెసలు (మెట్ట)		59 0 0
సెనగలు (జేబాకు)		48 8 0
సెనగలు (పంజాబ్)		37 0 0
ధనియాలు 25 తూములు	60/-65	0 0
ఉలవలు	40-0-0	43 0 0
ఆముదాలు		44 0 0
పంచదార (వుయ్యూరు)		114 0 0
కొబ్బరినూనె పెద్దబ్బా		38 4 0
బెల్లం మణుగు	9-8-0/-11	0 0
బెల్లం ,,	7-0-0	9 8 0
మిర్చి ,,	22-0-0	25 0 0
నీరుల్లి ,,		2 2 0
చింతపండు ,,	9-0-0	15 0 0
నువ్వులనూనె ,,		86 8 0
వేరుశనగపప్పు 177 శే॥		
[illegible]		65 8 0
కోరాడ		66 8 0
నూనె మణుగు		18 7 0
కేక్ 160 తూకాలు		23 8 0
కొబ్బరికాయలు1000కాయలు		229/-224
సంచులు 100		98 4 0
డిటో ఫార్వర్డు		91 0 0
కప్పు		11/- 12 0 0

పాలకొల్లులో నిరసన ప్రదర్శన

కేరళలో కేంద్రం జోక్యాన్ని నిరసిస్తూ ఆగస్టు 2వ తేదీ ఆదివారం రోజున పాలకొల్లులో పెద్ద ప్రొసెషన్ ప్రదర్శనం జరిగింది. తదనంతరం జరిగిన సభకు శ్రీ కొలిశెట్టి అప్పారావుగారు అధ్యక్షత వహించారు. శ్రీ భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు, శ్రీ అల్లూరి సత్యనారాయణగార్లు మాట్లాడారు.

కేంద్రం చర్యను నిరసిస్తూ సభలో తీర్మానించారు.

ఆచంటలో 2000మంది ఊరేగింపు

కేరళ ప్రభుత్వ బర్తరఫును నిరసిస్తూ ఆచంటలో [illegible] పాదవున 2000 మందితో ఊరేగింపు జరిగింది.

సాయంకాలం 5 వేల మందితో బస్ స్టాండువద్ద తాలూకా కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీ నెక్కంటి నరసింహారావుగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది. సభలో తాలూకా [illegible]

లేఖలు:

ముఖ్యమంత్రి సంజీవరెడ్డి సమాధానం చెబుతారా?

ఆర్యా,

కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసినందుకు అసమ్మతిగా సిర్పూర్ కాగజ్ నగర్ కమ్యూనిస్టు శాఖ ఆధ్వర్యాన యీనెల మూడవ తేదీన జరిపే బహిరంగసభలో ప్రసంగించుటకు నన్ను ఆహ్వానించారు.

వారి ఆహ్వానాన్ని అందుకొని కాగజ్ నగర్‌కు మూడవతేదీ ఉదయం జనతాలో చేరుకున్నాను. నా ఆగమన వార్తను కార్మికులు తెలుసుకొని తమ కాలనీకి తీసుకొనివెళ్ళి మాట్లాడుతున్న సందర్భంలో సాకల కిష్టయ్య నాయకత్వాన కొంతమంది ఐ.ఎన్.టి.యు.సి. గూండాలు నేనున్న ఇంటిపై దాడికివచ్చి కార్మికులను తరిమికొట్టారు. "మా అనుమతిలేకుండా కమ్యూనిస్టు లెవరూ కార్మికుల కాలనీలోకి ప్రవేశించరాదు. అట్లు ప్రవేశించినచో వారికి రక్షణవుండదు" అన్నారు. ఐ. ఎన్. టి. యు. సి. ఆఫీసుకు నడవాలని బలప్రయోగం చేశారు.

గూండాలు నన్ను తీసుకవెళ్ళుతూ దారిలో కొట్టాలని ప్రయత్నించారు. అంతలో 100 మంది కార్మికులు మిల్లునుండి పరుగెత్తుకొనివచ్చి దౌర్జన్యం జరుపకుండా ఆపివేశారు. అయినప్పటికీ గూండాలు ఐ.ఎన్.టి.యు.సి. ఆఫీసుకు తీసుకువెళ్ళి "రాజబహద్దూర్ గౌడ్‌లాంటి నాయకులకు తగు బుద్ధి చెప్పినాం. బహిరంగసభలో ప్రసంగించక వెంటనే బండికి వెళ్ళిపోలేనిచో ఏ ఫలితానికైనా సిద్ధపడాలి" అని హెచ్చరించి విడచిపెట్టారు.

ఈవిధంగా రెండు గంటలు నిర్బంధంలో పెట్టి కార్మికుల జోక్యంవలన విడిచిపెట్టారు. ఈ దాడి ఐ. ఎన్. టి. యు. సి. జాయింటు సెక్రటరీ హానీఫ్ బేగ్ ప్రోత్సాహంతో జరిగింది.

తర్వాత సాయంకాలం బహిరంగసభ జరిగింది. కార్మికులను సభలో పాల్గొనకుండా చేయుటకు దారిలో ఆటంకపరిచినప్పటికీ 1000 మందికి పైగా పాల్గొని ఉపన్యాసాలు విన్నారు.

పట్టపగలే ఐ. ఎన్. టి. యు. సి. నాయకులు, కమ్యూనిస్టు కార్యకర్తలపై దౌర్జన్యాలకు పూనుకోవడంవలన కార్మికుల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేదని భావిస్తున్నాను. కమ్యూనిస్టులతో కలసి మాట్లాడినట్లయితే తమకు ఐ.ఎన్. టి. యు. సి. గూండాలచే ప్రమాదముంటుందని అనేకమంది కార్మికులు నాతో చెప్పుతున్నారు.

ప్రతిపక్షాల సహకారంతో రాష్ట్రంలో శాంతి భద్రతలు రక్షించబడ్డాయని నిన్న అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగానికి భిన్నంగా తమ అనుయాయులైన కాంగ్రెసు, ఐ. ఎన్. టి. యు. సి. గూండాలచే ప్రతిపక్షాలకు రక్షణ లేకపోవడం ప్రభుత్వం గమనిస్తుందా?

ప్రతిపక్షాల సహకారాన్ని ప్రభుత్వం మనస్ఫూర్తిగా వాంఛించేఎడల ఐ. ఎన్. టి. యు. సి. గూండాలు జరిపిన అఘాయిత్యాలపై బహిరంగ విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిని శిక్షించాలని కోరుతున్నాను.

నల్లా నరసింహులు,
వరంగల్ జిల్లా కమ్యూనిస్టుసమితి
కార్యవర్గసభ్యుడు.
కాగజ్ నగర్, 4-8-59.

సత్యనారాయణగారు మాట్లాడారు. కేరళలో కేంద్రం చర్యను నిరసిస్తూ ఏకగ్రీవంగా సభలో తీర్మానించారు. ఆహార పదార్థాల ధరలను అదుపులోపెట్టి వెంటనే చౌక డిపోలు తెరవవలసినదిగా కూడా యింకొక తీర్మానం చేశారు.

నెల్లూరులో

పట్టణకమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన నెల్లూరు పురమందిరంలో మునిసిపల్ కౌన్సిలరు శ్రీ టి. రాయప్పగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది.

ఈ సభలో నెల్లూరు మునిసిపల్ కౌన్సిలరు శ్రీ వి. అనంతరామయ్యగారు మాట్లాడుతూ ఆనాడు స్వయంగా యేర్పడిన పాప్యులరు ఫ్రంటు ప్రభుత్వాన్ని యేవిధంగా బలవంతంగా దించివేశారో, ఆ విధంగానే ఎన్నికల ద్వారా కేరళలో యేర్పడిన కేరళ ప్రభుత్వాన్ని రద్దుచేస్తూ నెహ్రూ ద్రోహం చేశారనీ, భారతదేశచరిత్రలో జూలై 31 చీకటి దినంగా పరిగణింపబడుతుందనీ అన్నారు.

పిమ్మట నెల్లూరుతాలూకా కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి శ్రీ [illegible] ఏ. పద్మనాభయ్య, నెల్లూరు పట్టణకమిటీ కార్యదర్శి శ్రీ పి. రామకోటయ్యగార్లు కూడ మాట్లాడారు.

నక్కపల్లిలో

యలమంచిలి తాలూకా నక్కపల్లి గ్రామంలో తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం సందర్భంలో కేరళలో కేంద్రం జోక్యానికి నిరసనగా 200 మందితో ఊరేగింపు జరిగింది.

బహిరంగసభకు జిల్లా కమ్యూనిస్టు సమితి సభ్యులు శ్రీ గొర్లె నారాయణరావుగారు అధ్యక్షత వహించారు. సభలో విశాఖజిల్లా సమితి సభ్యులు శ్రీ చేకూరి సూర్యరాజు, శ్రీ డబ్బీరు నరసింహమూర్తి, శ్రీ పచ్చిపులుసు వీర్రాజు మాట్లాడారు.

సభానంతరము "కేరళ అంతర్నాటకం" అను ప్రహసనం ప్రదర్శితమైంది.

కేరళ రక్షణనిధి

నిడదవోలు, ఆగస్టు 3

కేరళ రక్షణనిధికి మొదటి విడతగా పశ్చిమ గోదావరిజిల్లా నిడదవోలు పట్టణంలో శ్రీ టి వి. రత్నం, శ్రీ గా. [illegible] శ్రీ [illegible] ప్రభృతులు రు 17 లు వసూలు చేసి పంపించారు.

ఒంగోలు తాలూకా అబ్బూరపాడు గ్రామ కమ్యూనిస్టు కమిటీవారు కేరళ రక్షణ నిధి కొరకు [illegible] రు 45 లు వసూలు చేసి పంపారు.

పాప్లిన్సు

షర్టింగులు

మెర్సిరైజ్డు ధోవతులు

ప్రింటెడ్ వాయిల్సు & లాన్సు

SANFORIZED
REGISTERED TRADE MARK

రైపూర్ మిల్స్ లిమిటెడ్,
అహమ్మదాబాదు

మీకున్నూ
-సినిమా తారవంటి ప్రకాశమాన చర్మసౌందర్యము

వైజయంతిమాల ఇలా చెప్పుచున్నది: "నా చర్మము లక్స్ టాయిలెట్ సబ్బు వల్ల శుభ్రముగాను నునుపుగాను వుంటున్నది. దాని మీగడ వంటి నురగ నా చర్మమునకు మంచిది మరియు దాని పరిమళము రోజల్లా నన్ను హాయిగా నుంచుచున్నది."

మీకున్నూ వైజయంతిమాలకున్నట్టి మనోహరమైన చర్మ సౌందర్యమును పొందవచ్చును. మీకు ప్రతి దినమూ సౌందర్యమునిచ్చే సబ్బుగా లక్స్‌ను వాడండి. జ్ఞాపకముంచుకోండి, లక్స్‌తో స్నానము ఎంతో ఆనందదాయకము!

శుద్ధమైన,తెల్లని,
లక్స్
టాయ్‌లెట్ సబ్బు
సినిమా తారలకు సౌందర్యమునిచ్చేసబ్బు

హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ వారి ఉత్పత్తి

LTS. 9-X52 TL



జ్వరమును తగ్గించి, మిమ్ములను యధాస్థితికి తెచ్చును

మలేరియా మిక్స్చర్ వేగముగా పర్యము జరిపి, మలేరియాగాని, ఇన్‌ఫ్లుయంజా లేక సామాన్య చలిజ్వరముగాని నివారించును.
కొంట్టె, జలుబు లేక గొంతువాపుల వాప్పిన్నా మీరు అస్వస్థతగా నున్నప్పుడు, వ్యాధి [illegible] వరకూ వేచియుండక, మలేరియా మిక్స్చర్‌ను సేవించి, వ్యాధి ముదిరి [illegible] త్వరగ [illegible].

జండూ మలేరియా మిక్స్చర్

జండూ ఫార్మసూటికల్ వర్క్స్ లిమిటెడ్
గోకలే రోడ్ సౌత్, బొంబాయి-28

Graphic-Z49

స్టాకిస్టులు:- మెస్సర్స్. దామోదర్ & కో., 10/94 మెయిన్‌బజార్‌రోడ్, విజయవాడ.
మెస్సర్స్ డి. జె. పరీఖ్ & కో. జామ్మామసీద్ దగ్గర, సికింద్రాబాద్ బ్రాంచి: సుల్తాన్ బజార్, హైదరాబాద్.

*
ప్రతీ రోజూ
ప్రతీ ఇంటా
ఎవరైనా
వాడుచున్నట్టిది
లోమ
శిరోజములను
నలుపు చేయునట్టిదిగాను
లేదా
తలనూనెగాను
వాడుచున్నారు.

లోకల్ ఏజెంట్లు:
ఎమ్.ఎమ్. అంబట్‌వాలా
అహమదాబాద్-1.
ఏజెంట్లు:
సి. నరోత్తమ్ అండ్ కో.
బొంబాయి-2

ఏజెంట్లు: విజయ మెడికల్ సిండికేట్, విజయవాడ, విజయనగరం.

30 లక్షల మందితో జపాన్‌లో శాంతి ప్రదర్శన

జూన్ పదో తేదీనుంచి ఆగస్టు నాల్గో తేదీవరకూ అఖండ శాంతియాత్ర

టోకియో, ఆగస్టు 4

జూన్ 10న ప్రారంభమై 80 లక్షల మంది ప్రజానీకం పాల్గొన్న బ్రహ్మాండమైన శాంతి ఊరేగింపు, నేడు హిరోషిమా శాంతి పార్కు వద్దకు చేరింది. రేపిక్కడ అణ్వస్త్రాల వ్యతిరేక ప్రపంచ మహాసభ ప్రారంభం కాబోతోంది.

ఆ ఊరేగింపు హిరోషిమాకు చేరుకునే ఆఖరి ఘట్టంలో, అటంబాంబుకు గురైన ఇద్దరు కూడ ఆ ఊరేగింపులో పాల్గొన్నారు.

ప్రదర్శకులు రెండు దళాలుగా ఏర్పడ్డారు. నిగాటా, టోకియోలనుండి ఒకదళమూ, క్యూషూకు దక్షిణాగా ఉన్న రోయాన్ దీవినుండి ఒకదళమూ ప్రదర్శనలు కొనసాగించింది.

ప్రదర్శకులు హిరోషిమా చేరుకునే ముందు, దారిపొడుగునా అసంఖ్యాక ప్రజానీకం వారికి అభినందించారు.

వ్యతిరేకులకు కన్నెర్ర

మితవాదులు ఏదో గలాభా తీసుకువచ్చి మహాసభను పాడుచేయాలని చూస్తున్నట్లుగానూ, ఈ మహాసభను వ్యతిరేకిస్తూ కరపత్రాలను పంచడానికి ఏర్పాటు చేసినట్లుగానూ తెలుస్తూంది.

24 దేశాలనుండి ప్రతినిధులు హిరోషిమా చేరుకున్నారు. వీరిలో సోవియట్ ప్రతినిధులు కూడా ఉన్నారు.

హిరోషిమాలో అటంబాంబు మడిసిపోయిన వారి స్మృత్యర్థం, సభలో, జపాను ప్రధాన మంత్రి కిషి పంపిన సందేశం చదువబడుతుంది.

కేరళలో ఎన్నికల కమీషనరు పర్యటన

తిరువనంతపురం, ఆగస్టు 5

కేరళ రాష్ట్రంలో కాంగ్రెసునాయకులతో పాటు పర్యటించేందుకు ప్రధాన ఎన్నికల కమిషనరు శ్రీ కె. వి. కె. సుందరం తిరువనంతపురం ఆగస్టు 7న రావచ్చు.

ఆయన ఆ రాష్ట్రంలో ఎన్నికల నాటికి పరిస్థితులను పరిశీలించి వ్యవహారాన్ని తనిఖీచేస్తారనీ, ఎన్నికల ఏర్పాట్లనుగురించి రాష్ట్రాధికారులతో చర్చిస్తారనీ తెలుస్తోంది.

కౌలుదార్ల తొలగింపుపై ఆంధ్ర శాసనసభ చర్చ

హైదరాబాద్, ఆగస్టు 5

భూములనుండి కౌలుదార్లను తొలగించుతున్న విషయమై అరగంట చర్చకు అవకాశం యివ్వాలని కమ్యూనిస్టు సభ్యులు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, శ్రీ జి. ఎల్లమందారెడ్డి గార్లు నేడు శాసనసభలో 74వ నిబంధన ప్రకారం కోరారు. స్పీకరు శ్రీ కాళేశ్వరరావుగారు ఆగస్టు 6వ తేదీన చర్చకు అవకాశం యివ్వడానికి అంగీకరించారు. (వి. వి)

ఆసియాలోకల్లా ప్రథమ ఇంధన ఉత్పత్తి కర్మాగారం

భారతదేశంలో నిర్మాణం

బొంబాయి, ఆగస్టు 4

భారత అణుశక్తి సంస్థకు చెందిన ట్రాంబేలో అణుశక్తి ఉత్పత్తికి సంబంధించిన ఇంధనాలను తయారుచేసే ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయినది. ఈ పరిశ్రమ ఒకటి, రెండు నెలల్లోనే ఉత్పత్తి ప్రారంభించనున్నది.

ఈ పరిశ్రమను నెలకొల్పడంతో, ఒక సోవియట్ యూనియన్ తప్ప అణుశక్తి రియాక్టర్లకు ఇంధనాన్ని ఉత్పత్తిచేసే పరిశ్రమ ఆసియాలోకెల్లా మనదే మొట్టమొదటి దేశం కాగలదు.

3వ వారం
వైజాగ్ - సరస్వతిలో
సిసిల్ బి డిమిల్లీస్
దిటెన్‌కమాండ్‌మెంట్స్
THE TEN COMMANDMENTS
విస్టావిజన్ & కలర్
9 తేదీ ఆదివారం ఉదయం 9-30కు ఆట
మొదటి 3 క్లాసులకు
అడ్వాన్సు బుకింగ్ కలదు.
రేట్లు: రు. 3, 1-86, 1-50, 0-94, 0-61

దాడులు, దౌర్జన్యాలు

(1వ పేజీ తరువాయి)

పార్టీకి చెందినపోయినా, స్కూళ్ళ మానేజర్ల ఉద్యమాన్ని వ్యతిరేకించినందుకుగాను డాక్టర్ కె. యం. మహమ్మద్ అనేవారి ఆస్పత్రిమీద కూడా దాడిచేశారు. మందులు, సామగ్రి ధ్వంసం చేశారు.

కాలికట్‌లో

కాలికట్‌లో పి. అలికోయా అనే కమ్యూనిస్టు సానుభూతిపరుణ్ణి విపరీతంగా కొట్టారు.

అంబలపూజ తాలూకా గీతపనివారి సంఘం కార్యాలయ కారనోకదాన్ని విధ్వంసం చేశారు.

అంతికాడ్‌లో (ఇక్కడనుంచే శ్రీ ముందస్సేరి శాసనసభకు ఎన్నికయ్యారు) మాజీ విద్యామంత్రి శ్రీ ముందస్సేరి గడ్డిబొమ్మ నొకదాన్ని ఊరేగించి తగులబెట్టారు. ఊరేగింపు జరిపేటప్పుడు దారిపొడుగునా జనంమీద దౌర్జన్యాలు చేస్తూనే వున్నారు. ఒక సైకిల్ షాపు యజమాని చంద్రన్ అనే ఆయనను తీవ్రంగా కొట్టారు. గీతపనివారి సహకారసంఘం కార్యాలయం దుకాణాని కొకదానికి నిప్పంటించారు. మన్నూరులో ఒక షాపుమీద దాడిచేసి సామానంతా నాశనంచేశారు. త్రిచూరునుంచి అంతికాడ్ వస్తూన్న ఒక ప్రయివేటు బస్సుమీద దాడిచేసి నాశనం చేశారు. అందులోవున్న ప్రయాణీకులనుకూడా చావమోదారు.

తిరువనంతపురంలో

తిరువనంతపురంలో 31వ తేదీ రాత్రి జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యాలయంపై విపరీతంగా రాళ్లు రువ్వారు. మరో చోటులో మాజీ న్యాయశాఖా మంత్రి శ్రీ కృష్ణయ్యర్‌నూ, పార్లమెంటు సభ్యుడు శ్రీ ఈశ్వరయ్యర్‌నూ బలపరుస్తున్నారని చెప్పి, చాలమంది బ్రాహ్మణులను చావచితక గొట్టారు. ఒక కట్టెల అడితీ మీద, కైస్తానిక దళానికి చెందిన శ్రీమతి సులోచన అనే ఆమె యింటిమీద దాడిచేశారు. నెయ్యాట్టింకరలో పి. యస్. పి. వారు ఊరేగింపు జరుపుతూ కమ్యూనిస్టుపార్టీ ఆఫీసుమీద రాళ్ళు రువ్వారు.

త్రిచూరు జిల్లా, ఒల్లూరులో చర్చి కలెక్టర్లు కత్తులు, కర్రలు పుచ్చుకొని జీపులమీద తిరుగుతూ దాడులు చేశారు. త్రిచూరు తాలూకా బీడీ వర్కర్ల సహకార సంఘంవారు నడుపుతున్న ప్రభాత్ బీడీఫ్యాక్టరీపై దాడిచేసి పొగాకంతా నాశనం చేశారు. సామానంతా విరగ్గొట్టారు. రికార్డంతా చించివేశారు. కిటికీ అద్దాలన్నీ పగులగొట్టారు. చాలమంది బీడీ కార్మికుల్ని చావచితగ్గొట్టారు.

బీడీ కార్మిక సంఘ నాయకులు ఇళ్ళలో వుండగా కిందకులాగి పడవేసి, విపరీతంగా కొట్టారు. ఒల్లూరు వడ్రంగి పనివారి సహకార సంఘానికి కార్యదర్శి అయిన శ్రీ వేలాయుధన్‌ను కత్తులతో పొడిచారు. మాటక్కర రీడింగ్‌రూం కార్యదర్శి శ్రీ సుకుమారన్‌ను తల పగిలేటట్లు కొట్టారు.

ఇలాంటివే సంఘటనలనుంచి ఇంకెన్నో వార్తలు వస్తున్నాయి.

పాలఘాట్‌నుంచి ఒకవిచిత్రమైన వార్త తెలియవస్తోంది. అక్కడ 11 మంది పి. ఎస్. పి. వలంటీర్లు విజయోత్సవం జరుపుతూ టిప్పుసుల్తాన్ కోటలోని (పురాతత్వశాఖ ఆఫీసు) కోనేరులో 11 మంది మంత్రులూ మునిగిపోతున్నట్లు ప్రదర్శించడంకోసం దాంట్లోకి దూకారు. ఆ దూకడంలో ఒకడికి దెబ్బలు తగిలాయి. ఆస్పత్రిలో చేర్చారు. ఈసంగతి ఊరంతా పెద్ద హాస్యాస్పదంగా చెప్పుకుంటున్నారు.

ఇన్ని జరుగుతున్నా, కమ్యూనిస్టులు వారి సానుభూతిపరులు చాలవరకు ప్రశాంతంగానే వుంటున్నారు. మంత్రివర్గాన్ని రద్దుచేయడంతో పెద్దపెట్టున దెబ్బలాటలు, కొట్లాటలు జరుగుతాయనీ కమ్యూనిస్టులు గల్లంతులు లేవదీస్తారనీ ఆశించిన వారంతా ఆశాభంగం చెందారు.

కమ్యూనిస్టు మంత్రివర్గం రద్దయ్యే సమయంలో గలాటాలు జరుగుతాయని వాటిని ఫోటోలు తీయడంకోసం భారత ప్రభుత్వం తాలూకా ఫిలిం డివిజన్ వారు ప్రత్యేకించి కొంతమంది ఫోటోగ్రాఫర్లను పంపారు. అందులో ఒకరు "చాలా ఆశాభంగమయింది. యిక్కడ పనిలేకుండా పోయింది" అన్నారు. దాంతో ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది సమావేశంలో ఉపన్యసించేటప్పుడు గవర్నరు టీపార్టీ అప్పుడూ కొన్ని ఫోటోలు తీసుకొని వెళ్ళారు.

కేరళ కమ్యూనిస్టుపార్టీ ప్రకటన

(1వ పేజీ తరువాయి)

విజయాలనూ పార్టీ ప్రమేయం లేకుండా కాపాడుకోవలసిన అత్యవసర బాధ్యత కేరళ ప్రజల యెదుర్కొంటున్నది.

శాసనసభ, రాష్ట్రపతి ఆమోదించడం వల్ల శాసనమైన విద్యాబిల్లును అమలు జరుగకుండాగాని, అడ్డుచేయడానికిగాని రాష్ట్రపతి పరిపాలనకు ఎట్టి హక్కూ లేదు.

జన్మీకరం రద్దుబిల్లునూ, భూసంస్కరణల చట్టాన్నీ, రాష్ట్రపతి వెంటనే ఆమోదించి, అమలు జరపాలి.

సహకార సూత్రం విస్తరణకై కమ్యూనిస్టు ప్రభుత్వం తీసుకున్న చర్యలను, బలహీనపరచే విధంగా రాష్ట్రపతి పాలనలో ఏ చర్యలూ జరుగరాదు. రాష్ట్ర ప్లానింగు సలహా సంఘాన్నీ, జిల్లా అభివృద్ధి కౌన్సిళ్ళనూ రద్దుచేయకూడదు.

కమ్యూనిస్టు నాయకత్వంక్రింద ఏర్పడ్డ ప్రభుత్వం హయాంలో సామాన్య ప్రజలు సాధించుకున్న హక్కులనూ, విజయాలనూ సంరక్షించుకునేందుకు, రాష్ట్రంలో అత్యధిక సంఖ్యాక ప్రజానీకం ఈ కార్యకలాపాలకు నిలబడుతుందని కమ్యూనిస్టు పార్టీ ఆశిస్తోంది.

కేరళను ఎవరు పరిపాలించాలి అన్న సమస్యను నిర్ణయించవలసింది కాంగ్రెసు అధిష్టానవర్గమూ, కేంద్ర ప్రభుత్వమూ కాదు. కేరళ ప్రజలే దానిని నిర్ణయిస్తారు. ప్రజల యొక్క తీర్పు కమ్యూనిస్టు పార్టీకి అనుకూలంగా ఉంటుందని కేరళ కమ్యూనిస్టు కమిటీ ఆశిస్తోంది.

రాష్ట్రంలో నేడెదుర్కొంటున్న తక్షణ కర్తవ్యాలను కమ్యూనిస్టుపార్టీ సభ్యులు, మిత్రులు సంపూర్ణమైన ఆత్మవిశ్వాసంతో నెరవేర్చాలి. కమ్యూనిస్టునాయకత్వం క్రింద ఏర్పడిన మంత్రివర్గం గత 28 మాసాలుగా రాష్ట్రంలో సాధించిన ఆర్థికాభివృద్ధి మార్గాన్నీ, ప్రజలయొక్క విజయాలనూ సంరక్షించేందుకు, వాటిని ముందుకు తీసుకుపోయేందుకు, ప్రజాస్వామ్యంలోనూ, సోషలిజంలోనూ విశ్వాసమున్న ప్రతివారినీ పార్టీలతో నిమిత్తం లేకుండా ఐక్యపరచి సమీకరించాలి.

రాష్ట్రపతిని కలుసుకొనబోవడంలేదని శ్రీ నంబూద్రిపాద్

మదురై, ఆగస్టు 5

ఢిల్లీలో రాష్ట్రపతినిగాని, ప్రధానినిగాని తాను కలుసుకోవడం లేదని శ్రీ నంబూద్రిపాద్, మదురైలో విలేఖరులతో చెప్పారు.

ఒక ప్రశ్నకు శ్రీ గోవిందన్ నాయర్ సమాధానం చెబుతూ, కేరళలో కౌలుదార్ల హక్కులపైనా, ఉపాధ్యాయుల హక్కులపైనా కొంత దాడి జరుగుతుందని తాను భావిస్తున్నామన్నారు. కమ్యూనిస్టు ప్రభుత్వం సాధించిన విజయాలనూ, కొన్ని శాసనాలద్వారా కొంతమంది ప్రజలకివ్వబడిన హక్కులనూ సంరక్షించేందుకు కమ్యూనిస్టుపార్టీ తన శక్తిని కేంద్రీకరిస్తుందని చెప్పారు.

కేరళలో కేంద్రం జోక్యం చేసుకోవటంవల్ల ఏర్పడ్డ పరిస్థితులను గురించి గత రెండు రోజులుగా జరిగిన రాష్ట్ర కమ్యూనిస్టుకమిటీ సమావేశం పరిశీలించిందనీ, తగు కార్యక్రమాన్ని రూపొందించిందనీ ఆయన చెప్పారు.

కేరళలో డిటెన్షన్ చట్ట ప్రయోగమా?

న్యూఢిల్లీ, ఆగస్టు 5

కేరళలో సాంఘిక వ్యతిరేకశక్తుల నణచేందుకూ, మామూలు పరిస్థితులను తెచ్చేందుకూ, డిటెన్షన్ చట్టాన్ని, క్రిమినల్ ప్రొసీజరు కోడ్‌లోగల నేర నివారణ సెక్షనులను అమలు జరపవలసిందని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించినట్లుగా తెలుస్తున్నట్లు పి. టి. ఐ. విలేఖరి వ్రాస్తున్నాడు.

'శాంతిప్రియులకు సంతోషకరం'

ఐక్-కృశ్చేవ్‌ల పర్యటనపై టిటో వ్యాఖ్య

బెల్‌గ్రేడ్, ఆగస్టు 5

కృశ్చేవ్ అమెరికా వెళ్ళడం, ఐసెన్‌హోవర్ సోవియట్ యూనియన్ సందర్శించడం, ఈ రెండూ ప్రపంచాన్ని నేడెదుర్కొంటున్న క్లిష్టసమస్యలను పరిష్కరించేందుకు తోడ్పడగలవనీ, ఈ వార్తకుగల ప్రాముఖ్యం సాధారణమయింది కాదనీ యుగోస్లావియా అధ్యక్షుడు టిటో అన్నారు.

యింకా యిలా అన్నారు:

"ప్రపంచంలో శాంతిప్రియులైన ప్రజలందరికీ యీవార్త అపారమయిన సంతోషం కలుగజేసి వుంటుంది. ప్రపంచంలోకెల్లా బలీయమైన యీ రెండు దేశాల అధినేతలిద్దరూ, ఒకరి దేశాన్ని మరొకరు సందర్శించడమూ, కీలకమైన చర్చలు జరపడమూ, ప్రతిష్టంభనలో చిక్కుకొని అయోమయంగా ఉన్న అంతర్జాతీయ పరిస్థితులను, శాంతికి, సమస్యల పరిష్కరించగల మార్గానికి మళ్ళించగలవు"

టిటో స్వయంగా, ఈ వార్తపై వ్యాఖ్యానించడంవల్ల ఇక్కడి ప్రభుత్వ వర్గాలు ఈవార్తకెంత ప్రాముఖ్యత నిస్తున్నారో విదితం చేస్తున్నదని ఇక్కడి పరిశీలకులంటున్నారు.

నెహ్రూ సవరణ

(1వ పేజీ తరువాయి)

ఏర్పడ్డాయి. కమ్యూనిస్టులు ఇంకొక అడుగు ముందుకువేసి గత ఎన్నికల్లో ముస్లింలీగుతో ఒప్పందాలు చేసుకొని కొన్ని సీట్లు సంపాదించారు.

కాని కేరళలో యిప్పుడు బయలుదేరిన ఆందోళన ప్రజావెల్లువరూపం ధరించింది. కడకు మంత్రులతాలూకా దగ్గర బంధువులు కూడా జైళ్లకు వెళ్ళారు.

పోతే ఇక మన్నాత్ పద్మనాభన్ గురించి: ఆయన నాయర్ సేవాసమితిని రద్దుచేసి, రాజకీయ రంగంనుండి విరమించారు. పూర్తిగా విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. మహాత్మాగాంధీ పేరుతో ఒక కాలేజీని కూడా నెలకొల్పారు. శ్రీ నంబూద్రిపాద్‌తో చర్చించి ఆ కాలేజీలో కొన్ని అదనపు శాఖలను సైతం ఏర్పర్చారు.

కేరళ ప్రభుత్వం తయారుచేసిన వ్యవసాయ సంస్కరణల చట్టం విషయంలో కాంగ్రెసుకూ, కమ్యూనిస్టు పార్టీకి ఏమంత ఎక్కువ భేదంలేదు."

కేరళపై కాంగ్రెస్‌పార్టీ చర్చ ఈ సమావేశంతో ముగిసింది. శ్రీయుతులు జోకిం ఆల్వా, ఎస్. సి. ఖాస్లీవాల్, టి. ఆర్. అచార్, మనియంగాడన్, శ్రీమతి రేణుకా రే, జనచంద్రానంద్ రఘునాథ్‌సింగ్ నేటి చర్చల్లో పాల్గొన్నారు.

గురువారంనాడు పార్టీ తిరిగి సమావేశమై నిర్మాణ సమస్యలను చర్చిస్తుంది.

తుంగభద్ర ఎగువకాల్వ:

డబ్బు లభ్యమయితేనే మూడేళ్లలో ప్రథమ దశ పూర్తి

శాసనపరిషత్తులో నీటిపారుదలమంత్రి వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 5

తుంగభద్ర ప్రాజెక్టు 2 దశల్లో నిర్మించబడుతుందనీ, ఇప్పుడు ప్రారంభమయిన మొదటిదశ, తగినంత డబ్బు లభ్యమయితే, మూడేండ్లలో అంటే, 1960-61 ఆఖరుకు పూర్తి కావచ్చుననీ శ్రీ కొల్లా వెంకయ్య ప్రశ్నకు నీటి పారుదల మంత్రి శ్రీ కె. వి. నరసింగరావు శాసనపరిషత్తులో జవాబు చెప్పారు.

మూడవ పంచవర్ష ప్రణాళిక ఆఖరులోగానే ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు వచ్చాయనీ, అయితే ప్రణాళికా సంఘం సూచనపై ఈ ప్రాజెక్టును 2 దశల్లో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి అన్నారు.

ఇప్పుడు ప్రారంభమయిన మొదటి దశ పూర్తిఅయ్యే విషయం డబ్బుపైన ఆధారపడి వుంటుందన్నారు. ప్రస్తుతం మధ్యపెన్నారు రెగ్యులేటరు ఉత్తర దక్షిణ కాల్వల నిర్మాణం జరుగుతోందన్నారు.

ఉల్లిగడ్డలు, మిర్చి దిగుమతి

గత సంవత్సరం మార్చి నెలలో ఆంధ్ర సహకార సంఘాల తరఫున ఆంధ్ర సహకార మార్కెటింగు ఫెడరేషన్ ఉల్లిగడ్డలు, మిర్చి మొదలగు సరకుల ఎగుమతి వ్యాపారం చేయడానికి ప్రభుత్వం అనుమతించినదని వ్యవసాయ మంత్రి శ్రీ తిమ్మారెడ్డి శ్రీ కొల్లా వెంకయ్య ప్రశ్నకు సమాధానమిస్తూ చెప్పారు.

ఇంతకుముందు ఎగుమతికోటాలు ఆయా జిల్లా సహకార మార్కెటింగు సొసైటీలకివ్వబడేవి. 57-58 లో 570 టన్నుల ఉల్లిగడ్డలు జిల్లామార్కెటింగ్ సొసైటీలద్వారా ఎగుమతిచేయడానికి అనుమతి ఇచ్చారు. 58-59 లో 88,720 టన్నుల ఉల్లిగడ్డలు ఆంధ్ర సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా ఎగుమతిచేయడానికి లైసెన్సు ఇచ్చారు. అయితే, 57-58 లో జిల్లా సొసైటీలు ఎగుమతి చేసిన ఉల్లిగడ్డలు 5840 టన్నులు మాత్రమే. 58-59 లో రాష్ట్ర మార్కెటింగు సొసైటీ ఎగుమతి చేసిన ఉల్లిగడ్డలు 4,972 టన్నులు. ఈ సరుకు ప్రధానంగా సిలోన్, బర్మా, జపాన్ దేశాలకు ఎగుమతి అయిందని మంత్రి తెలియజేశారు.

తుంపాల ఫ్యాక్టరీ

తుంపాల ఫ్యాక్టరీ కార్మికులను యాజమానులు తాత్కాలికంగా పనులనుండి నిలుపుదల (లే ఆఫ్) చేసిన మాట వాస్తవమేనని శ్రీ ఎ. వి. రమణ ప్రశ్నకు కార్మిక మంత్రి సమాధానమిచ్చారు. అయితే, ఆ ఫ్యాక్టరీని అక్కడనుండి తరలించే ఉద్దేశ్యంతో ఇది జరగలేదనీ, ఫ్యాక్టరీలో పనిలేని దానివల్ల ఇలా చేశారని మంత్రి అన్నారు. 72 వేల టన్నుల చెరుకు అవసరమయివుండగా 42 వేలటన్నుల చెరుకే ఫ్యాక్టరీకి వచ్చిందన్నారు. చక్కెరఫ్యాక్టరీ యాజమానులు తక్కువ ధరలు చెల్లించడం మూలాన్నే చెరుకు ఫ్యాక్టరీకి రాలేదన్నారు. స్థానిక రైతులు ఈఫ్యాక్టరీని కొని సహకార పద్ధతిపై నడపడానికి ముందుకువస్తే ప్రభుత్వం వారికి తగుసహాయం చేయగలదని అప్పుడు పాతకార్మికులనే ఈ ఫ్యాక్టరీలో నియమించబడేలా ప్రభుత్వం ప్రయత్నిస్తుందనీ అన్నారు.

బాన్, ఆగస్టు 5

ఐసెన్‌హోవర్‌తో తన సంభాషణలు కొనసాగుతున్నంత కాలమూ బెర్లిన్ సమస్యలో మార్పేమీవుండదని సోవియటు ప్రధాని కృశ్చేవ్ చేసిన ప్రకటనకు పశ్చిమ జర్మనీ ప్రభుత్వ వర్గాలు సంతృప్తిని వెలిబుచ్చినట్లు తెలుస్తోంది.

ఆంధ్రలో ముడి ఇనుము

ఇప్పుడు బయటికితీసే సమస్య లేదని లోక్‌సభలో మంత్రి జవాబు

న్యూఢిల్లీ, ఆగస్టు 5

ముడి ఇనుము లభ్యమయ్యే ప్రాంతాలలో, ఏయే ప్రాంతాలను పబ్లిక్ రంగానికి కేటాయించాలో నిర్ణయమయిన తరువాతనే, ఆంధ్ర ప్రదేశ్‌లో కొత్తగా కనుక్కొన్న ముడిఇనుమును పైకి తీసేవిషయం ప్రభుత్వం పరిశీలిస్తుందని గనుల ఇంధనాలమంత్రి శ్రీ కె. డి. మాలవ్యా నేడు లోక్‌సభలో శ్రీ రామిరెడ్డి అడిగిన ప్రశ్నకు వ్రాతమూలకమయిన సమాధానమిచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 48కోట్ల టన్నుల ముడిఇనుము లభ్యమవుతుందని భూగర్భశాస్త్రజ్ఞుల అంచనా. ఇది గుంటూరు, నెల్లూరు, హైదరాబాదు, కర్నూలు జిల్లాలలో వుంది. ఈ ప్రాంతాలలో కొన్ని చోట్ల ప్రైవేటు వ్యక్తులు గనులు త్రవ్వి ఈ ఖనిజాన్ని అమ్ముకొంటున్నారు.

క్విలన్‌లో

క్విలన్, ఆగస్టు 5

క్విలన్‌లోని ఒక బ్రిటిష్ వర్తక సంస్థలో పనిచేస్తున్న 200 మంది ఉద్యోగులు బోనసు యివ్వవలసిందిగా కోరుతూ నేడు సమ్మె జరిపారు.

అక్టోబరులో కృశ్చేవ్ పెకింగ్ సందర్శన?

జెనీవా, ఆగస్టు 5

సోవియట్ ప్రధాని కృశ్చేవ్ వచ్చే అక్టోబరు మాసంలో చైనా రాజధాని పెకింగ్ సందర్శించనున్నారని యిక్కడ విశ్వసనీయ వర్గాలద్వారా తెలియవచ్చింది.

ఆయన అక్టోబరు 1వ జరుగనున్న చైనా విప్లవదశ వార్షికోత్సవాలలో పాల్గొంటారని తెలుస్తోంది.

"శుభవార్త"

శ్రీ భావే వ్యాఖ్య

శ్రీనగర్, ఆగస్టు 5

అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్, సోవియటు ప్రధాని కృశ్చేవ్‌లు సమావేశం కానున్నారన్న వార్తపై ఆచార్య వినోబా భావే వ్యాఖ్యానిస్తూ ఇది "శుభవార్త" అన్నారు.

పరినారు అమ్మకం
మావద్ద పాలఅక్కుల్లు యితర అన్ని రకాల పరినారు ఎంత కావలసినను దొరకును. ఈ పరినారు చల్లపల్లికి ఒక మైలు లోపున నున్న రామానగరంలో వున్నది.
వివరములకు: వేమూరి వెంకటేశ్వర్లు, రామానగరం, చల్లపల్లి(పోస్టు), కృష్ణాజిల్లా.

కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, గుంటూరు, (A.P.)
కేంద్ర ప్రభుత్వముచే B. E. డిగ్రీలకు సమానముగా రికగ్నైజు కాబడిన A. M. I. E. పరీక్షలకు అనుభవము, గొప్ప విద్యార్హతలు గలిగిన అధ్యాపకులచే ప్రాక్టికల్ ట్రైనింగ్, అప్రెంటీస్ షిప్పులతో B. A., B. Sc., Inter (or equivalent) Pre-University, M. P. C. తో ప్యాసైన విద్యార్థులకు వరుసగా 2, 3, 4 సంవత్సరముల కోర్సులు శిక్షణ ఇవ్వబడును. ప్రాస్పెక్టస్, అడ్మిషన్ ఫారముకు రు. 1/- M.O. చేయండి.
తాతినేని సూర్యనారాయణరావు, C. E., A. M. I. E., ప్రిన్సిపాల్.

నేడే మా అభివందనలు
లాయల్ బ్రదర్సు గోల్డు అండ్ సిల్వరుజ్యూయలర్సు
మెయిన్‌రోడ్డు—రాజమండ్రి,
21వ సం॥ అభినందనలు. స్థాపితం ది 7 8-38
ఈ ఇరువది ఒక్క సంవత్సరములనుండి మా వ్యాపారాభివృద్ధికి తోడ్పడిన మా ఖాతాదారులకు, మిత్రులకు ఈ శుభసమయములో మా హృదయ పూర్వక అభినందనల నందచేయుచున్నాము.
ఇట్లు, ప్రొప్రయిటరు,
పూసపాల పుల్లయ్య.


3వ. వారం
భారత భాగవత సమ్మేళనమే యీచిత్రములోని కథాసారము...
బసంత్ పిక్చర్సు వారి
వీర ఘటోత్కచ
తెలుగు
(వత్సలాకళ్యాణం)
వాడియాబ్రదర్సుప్రొడక్షన్.
తెలుగువెర్షన్ నిర్మాణం ఫేమింసెంటర్.
దర్శకత్వం...బాబూభాయిమిస్త్రీ • మాటలు, పాటలు...శ్రీ శ్రీ
పూర్ణా రిలీజ్
నైజాం.. చిత్ర రిలీజ్
LOODLIGHT

పిల్లల ఆనందమే తల్లుల స్వర్గం
తల్లుల సక్రమ శిక్షణయే పిల్లల భావి భాగోదయం. అని నిరూపించే అసమాన పౌరాణిక చిత్రం....
7వ వారం
శ్రీకృష్ణసాయిఫిలింస్ వారి
గాంధారిగర్వభంగం
తెలుగు
నిర్మాత..యర్రాఅప్పారావు
మాటలు, పాటలు......శ్రీశ్రీ
సంగీతం.....పామర్తి
పూర్ణా రిలీజ్
FLOODLIGHT

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షులు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరి బలరామమూర్తి, విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్, కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు, విజయవాడ - 2.